E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 07-04-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:95 || పేజీలు–6
www.ekaburu.com

## యుద్ధ ప్రభావిత రంగాలకు మద్దతు ఇస్తాం







### గ్రాండ్ ట్రంక్ రూట్‌లో 120 కొత్త రైళ్లు!

ఈఏడాది చివరి నాటికి పూర్తిస్థాయిలో మూడో లైన్ అందుబాటులోకి


ఇప్పటికే 700 కి.మీ. మేర వాడకం మొదలు

దీంతో 36 ప్రయాణికుల రైళ్లు, 50 గూడ్సు రైళ్ల సంఖ్య పెంపు




### జైళ్ల శాఖ మంత్రిగా చేశా.. మీ సమస్యలు నాకు తెలుసు!

చర్లపల్లి జైలులో 'నివృత్తి' మత్తు విముక్తి కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా జైళ్లలో పరిస్థితుల మెరుగుదలకు ఎన్నో చర్యలు




### వర్షం వల్ల మ్యాచ్ రద్దు.. కోల్‌కతా, పంజాబ్ జట్లకు చెరో పాయింట్




### 'ధురంధర్ 2'పై బాలీవుడ్ అసూయ




### భారత్‌ను కేంద్రప్రభుత్వం చీకటిలో ఉంచుతోంది

..రాహుల్ విమర్శలు

ఈ కబురు, ఢిల్లీ: భారతదేశ డేటా సార్వభౌమాధికారం విషయంలో కేంద్రప్రభుత్వం దేశాన్ని చీకటిలో ఉంచుతోందని,

# 2034 వరకు మా సర్కారే

- మళ్లీ గడీల పాలన కావాలని ఎవరూ కోరుకోరు
- పిప్రి సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- పదేళ్లలో మీరు చేయలేని ఎన్నో గొప్ప పనులు చేశాం
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేని ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తున్నాం... పార్టీలు చూడకుండా, ప్రజల కష్టాలు చూసి పథకాలు అమలు చేస్తున్నామన్న సీఎం
- గత ప్రభుత్వం సన్న బియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన ఎప్పుడైనా చేసిందా? అంటూ నిలదీత



ఈకబురు, ఆదిలాబాద్: 'మళ్లీ వచ్చేది మా ప్రభుత్వమే.. 2034 వరకు ప్రజా ప్రభుత్వమే కొనసాగుతుంది.. మీ బాగోతం ప్రజలు చూశారు.. మళ్లీ గడీల పాలన కావాలని ఎవరూ కోరుకోరు. పదేళ్లలో మీరు చేయ లేని ఎన్నో గొప్ప పనులు మా ప్రభుత్వం చేసింది.. ఇంకా చేయాల్సినవి ఉన్నాయి..' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'అడ్డు పడడానికి ఊరూరా తిరగడం కాదు.. ఎంతసేపూ లొల్లి పెట్టాలి.. యాగీ చేయాలనే దృక్పథంతోనే వెళ్తున్నారు..' అంటూ విపక్ష బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

**పదేళ్లలో ఇలాంటి సంప్రదాయం చూశారా?**

'పీసీసీ అధ్యక్షుడిగా అప్పట్లో నిర్మల్‌లో నిరసన తెలిపినా, ఇంద్రవెల్లిలో దండోరా పెట్టినా.. భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర నిర్వహించినా.. ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ఉక్కు సంకల్పంతోనే పోరాటం కొనసాగించాం. ఎన్ని కేసులు పెట్టినా కొట్లాడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చాం. ఎన్నికలప్పుడే రాజకీయాలు..

మిగతా 2లో



# కాల్పుల విరమణకు ఇరాన్ నో ..హెచ్చరించిన ట్రంప్

- మధ్యవర్తుల ప్రతిపాదనకు తిరస్కరణ
- తాజాగా అమెరికాకు 10 షరతులు
- భారీ మూల్యం చెల్లిస్తారని హెచ్చరించిన ట్రంప్
- మరో 24 గంటల్లో హార్ముజ్‌ను తెరవాల్సిందే
- ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్
- ఐఆర్‌జీసీ నిఘా సారథి, ఖుద్స్ ఫోర్స్ నేత హతం
- ఇరాన్‌లో 30 మంది, ఇజ్రాయెల్‌లో నలుగురు మృతి

ఈకబురు,దుబాయ్/జెరూసలేం/వాషింగ్టన్: నెలన్నర రోజులుగా ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న పశ్చిమాసియా యుద్ధం మరింత తీవ్రతరమయ్యే సంకేతాలు కన్పిస్తున్నాయి. కాల్పులకు 45 రోజుల పాటు విరామం ఇచ్చేలా అమెరికా, ఇరాన్‌లను ఒప్పించేందుకు ఈజిప్టు, టర్కీ, పాకిస్తాన్ సోమవారం చేసిన ప్రయత్నాలు

మిగతా 2లో



## 'భవ్య బాసర'కు భూమిపూజ

ఆలయం పునరాభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం

యంగ్ ఇండియా స్కూల్‌కు శంకుస్థాపన

మనవడు రియాన్ష్ కు

02



## రూ.3 వేల కోట్ల విలువైన భూములను కొల్లగొట్టే కుట్ర

- కోహెడలో మార్కెట్ నిర్మాణానికి 200 ఎకరాల అనువైన స్థలం, డీపీఆర్ సహా రూ.350 కోట్లు సిద్ధంగా ఉన్నా పనులెందుకు ప్రారంభించలేదు ?
- కోర్టు వివాదంలో ఉన్న 'దిల్'భూములను మార్కెట్‌కు ఎలా ఇస్తారు ?
- రైతులు ముఖ్యమా ? వ్యాపారులు ముఖ్యమా తేల్చుకోవాలి
- ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీశ్‌రావు

ఈకబురు,రంగారెడ్డి జిల్లా: 'అసైన్డ్ భూములకు పట్టాలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ తర్వాత కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి.. సెటిల్‌మెంట్లకు దిగుతోంది. ఇప్పటికే నాదర్‌గుల్‌లోని రూ.7 వేల కోట్ల

02

# ఎజెండాలో ఆ రెండే పెండింగ్!

## యూసీసీ, 'ఒక దేశం, ఒకే ఎన్నిక'పై మోదీ
## వాటిని త్వరలోనే నెరవేరుస్తామని వెల్లడి
## బీజేపీ ఎదుగుదలకు కార్యకర్తలే మూలం
## పార్టీ వ్యవస్థాపక దిన ప్రసంగంలో ప్రధాని

ఈకబురు,న్యూఢిల్లీ: "బీజేపీ ఎజెండాలోని కీలకాంశాల్లో అసంపూర్తిగా మిగిలినవి రెండే. ఒకటి 'ఒక దేశం, ఒకే ఎన్నిక'. మరొకటి ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)" అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. "వాటిపై ఇప్పటికే దేశవ్యాప్తంగా సానుకూల చర్చలు జరుగుతున్నాయి. త్వరలో ఆ రెండు హామీలను కూడా నెరవేరుస్తాం" అని వెల్లడించారు. బీజేపీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని వర్చువల్‌గా ప్రసంగించారు.
భారత్‌ను స్వయంసమృద్ధంగా, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే బీజేపీ లక్ష్యమని పునరుద్ఘాటించారు.




# తగ్గని సిలిం'డర్'!

## 20 రోజులైనా అందని వంటగ్యాస్
## కమర్షియల్ సిలిండర్లు లేక హోటళ్ల పరేషాన్
## గ్యాస్ ఏజెన్సీలు, గోడౌన్‌ల వద్ద క్యూలు

ఈకబురు, హైదరాబాద్: 'వంట గ్యాస్‌కు ఎలాంటి ఇబ్బంది లేదు. బుక్ చేసుకున్న ప్రతీ ఒక్కరికి సిలిండర్ పంపిణీ చేస్తాం. ఆందోళన వద్దు'.. ఇది ఇరాన్- ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఆ శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర చేసిన ప్రకటన. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. బుకింగ్ చేసి 15, 20 రోజులు దాటినా సిలిండర్లు ఇంటికి చేరడం లేదని గృహిణులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీంతో గ్యాస్ ఏజెన్సీలు, గోడౌన్‌ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలు కడుతున్నారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ వంటి నగరాల్లోనే కాదు, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. ఉదయం నుంచే గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూలు కడుతున్న ప్రజలు 'ఒక్క సిలిండర్ ఇప్పించండి'అంటూ వేడుకుంటున్నారు. కొందరు వినియోగదారులు నేరుగా గోడౌన్‌కు వెళ్లి ఏజెన్సీలకు అదనంగా సొమ్ములు చెల్లించి సిలిండర్ తీసుకుంటున్న పరిస్థితి ఉంది.

**పెండింగ్‌లో లక్షల బుకింగ్‌లు**

రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో బుకింగ్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. రోజువారీ సరఫరా జరుగుతున్నప్పటికీ డిమాండ్‌కు సరిపడా పంపిణీ జరగడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. సింగిల్ సిలిండర్ మాత్రమే ఉన్నవారితోపాటు కుటుంబాలకు దూరంగా హైదరాబాద్ వంటి నగరాల్లో సింగిల్ రూముల్లో ఉండి ఉద్యోగాలు చేసుకుంటున్న యువతీ యువకులు వంట గ్యాస్ దొరకక పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.




# నీరు ఉంటే... సంపద ఉన్నట్లే

## జల సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్
## రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీ వైసీపీ
## యాడికి 'జలధార' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు




**ఈ కబురు, అమరావతి :-**

జలమే సంపద... దాన్ని ఎంత పొదుపుగా వినియోగించుకుంటే అంత సంపదను సృష్టించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 'జలధార'తో రాష్ట్రంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేలా జలహారతి కార్యాచరణ చేపడదామని పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా, యాడికిలో 'జలధార..నీటి భద్రతసాగు నీటి సంఘాల బాధ్యత' అనే కార్యక్రమంలో పాల్గొని 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి విడుదల చేశారు. అనంతరం నీటి భద్రతసాగునీటి సంఘాల బాధ్యత పేరుతో రూపొందించిన యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ....నీరు మనందరికీ సర్వస్వమని, నీటిని సంరక్షించుకోడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 'రాష్ట్ర వ్యాప్తంగా నీటి భద్రత కోసమే పనిచేస్తున్నాం

## తగ్గని సిలిం'డర్'!



హైదరాబాద్‌లోని చర్లపల్లిలో ఉన్న భారత్, ఇండేన్, హెచ్‌పీ గ్యాస్ ఫిల్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్ పెద్దఎత్తున జరుగుతోందని చెబుతున్నప్పటికీ వినియోగదారులకు సకాలంలో అందడం లేదు. దీంతో చాలామంది ఎలక్ట్రిక్, ఇండక్షన్ స్టవ్‌లను కొనుగోలు చేస్తున్నారు.

కమర్షియల్ సెక్టార్‌లో తీవ్ర సంక్షోభం

హోటళ్లు, చిన్న వ్యాపారులు గ్యాస్ కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. బ్యాచ్‌లర్లుగా, హాస్టళ్లలో భోజనాలు చేస్తున్న వారి పరిస్థితి సంకటంగా మారుతోంది. కమర్షియల్ సిలిండర్లు లభించకపోవడంతో హోటళ్లలో టిఫిన్లు, భోజనాలకూ ఆంక్షలు విధిస్తున్నారు. కాగా, 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర భారీగా పెరిగి రూ. 2,300కు చేరింది. ప్రైవేటు ఏజెన్సీలు కిలో ఎల్‌పీజీని రూ. 250కి విక్రయిస్తున్నాయి. అది కూడా దొరకకపోవడంతో బ్లాక్‌లో ఒక్కో సిలిండర్‌కు రూ.7వేల వరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. సకాలంలో గ్యాస్ అందించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## కాల్పుల విరమణకు ఇరాన్ నో!.. హెచ్చరించిన ట్రంప్



కాల్పులకు విరామంతో పాటు హోర్ముజ్ జలసంధిని తెరవడం తదితరాలతో కూడిన ప్రతిపాదనను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ, పశ్చిమాసియాలో అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్‌కు ఆయా దేశాల ప్రతినిధులు అందజేశారు.

కానీ ఈ ప్రతిపాదనను ఇరాన్ పూర్తిగా తిరస్కరించింది. ''తాత్కాలిక కాల్పుల విరమణ కోసం హోర్ముజ్‌ను తెరవడం ఇరాన్‌కు ఏ మాత్రమూ అంగీకారం కాదు. ఈ విషయాలన్నింటినీ పాక్ ద్వారా ఇప్పటికే అమెరికాకు తెలియజేశాం'' అని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ వెల్లడించింది. యుద్ధానికి శాశ్వతంగా తెర దించడం మినహా మరేదీ తమకు అంగీకారయోగ్యం కాదని కైరోలోని ఇరాన్ దౌత్య బృందం సారథి మొజ్తబా ఫిర్‌దౌసీ పోర్ కుండబద్దలు కొట్టారు! అంతేగాక యుద్ధానికి తెర దించే విషయమై ఇరాన్ తాజాగా అమెరికాకు 10 షరతులు కూడా విధించింది!

ఈ పరిణామంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. ఇరాన్ భారీ మూల్యం చెల్లించక తప్పదని స్పష్టం చేశారు. హోర్ముజ్‌ను తెరవడంపై కూడా అంతకుముందే ఇరాన్‌కు ఆయన మరిన్ని హెచ్చరికలు చేశారు. ''మీకు మంగళవారం రాత్రి 8 (భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 5) గంటల వరకే గడువు. ఆలోపు దిగిరాకుంటే కనీవినీ ఎరగని దాడులతో సర్వనాశనం చేసేస్తాం'' అంటూ హెచ్చరించారు. ఇరాన్‌పైకి అమెరికా ఇప్పటికే అత్యాధునిక లాంగ్ రేంజ్ జేఏఎస్ఎస్ఎం-ఈఆర్ క్షిపణులను భారీ సంఖ్యలో ఎక్కుపెట్టినట్టు వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి!

సౌత్ పార్స్‌పై ఇజ్రాయెల్ దాడులు

ఇజ్రాయెల్, అమెరికా సోమవారం ఇరాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. ఇరాన్‌కు అత్యంత కీలకమైన సౌత్ పార్స్ చమురు క్షేత్రంపై కూడా ఇజ్రాయెల్ భారీగా దాడులకు దిగింది. దాంతో అక్కడి పెట్రో కెమికల్ ప్లాంటుకు తీవ్ర నష్టం వాటిల్లినట్టు సమాచారం. టెహ్రాన్‌పై యుద్ధ విమానాలు గంటల తరబడి అతి తక్కువ ఎత్తులో ఎగురుతూ బాంబుల వర్షం కురిపించాయి.

ఈ దాడుల్లో రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) నిఘా విభాగం అధిపతి మజీద్ ఖదేమీ మరణించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అంతేగాక ఐఆర్‌జీసీకి చెందిన ఖుద్స్ ఫోర్స్ కీలక నేత అస్ఘర్ బకేరీని కూడా అంతం చేసినట్టు పేర్కొంది. రాజకీయ, సైనిక ప్రముఖులందరినీ ఒక్కొక్కరుగా అంతం చేసి తీరతామని స్పష్టం చేసింది. మజీద్ మృతిని ఇరాన్ అధికారిక మీడియా కూడా ధ్రువీకరించింది. ఇజ్రాయెల్ దాడుల్లో టెహ్రాన్‌లోని షరీఫ్ యూనివర్సిటీలో పలు భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

ఆన్‌లైన్ క్లాసుల కారణంగా విద్యార్థులెవరూ లేకపోవడంతో భారీ ప్రాణనష్టం తప్పింది. ఎస్లాంశహర్ నగరంపై దాడుల్లో 15 మంది దాకా మరణించినట్టు అధికారులు వెల్లడించారు. కోమ్ నగరంలో పౌర ఆవాసాలపై దాడుల్లో ఐదుగురు, ఇతరచోట్ల మరో ఆరుగురి దాకా మృతి చెందారన్నారు. టెహ్రాన్‌లో ఓ ఇంటిపై జరిగిన దాడికి మరో ముగ్గురు బలయ్యారు. లెబనాన్‌లో కూడా దాడులను ఇజ్రాయెల్ తీవ్రతరం చేసింది. ఐన్ సాదే నగరంలో లెబనాన్ సైనికాధికారి ఒకరు దాడుల్లో మరణించారు.

ఒక్క రాత్రిలోనే నాశనం చేసేస్తాం

ఇరాన్‌కు ట్రంప్ తాజా హెచ్చరికలు

ఇరాన్ అంతటినీ ఒకే ఒక్క రాత్రిలో సర్వనాశనం చేసేయగల సత్తా అమెరికా సొంతమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ''అది బహుశా మంగళవారం రాత్రే కావచ్చు'' అంటూ తాజాగా మీడియాతో మాట్లాడుతూ ఆయన హెచ్చరించారు. ఇరాన్ భూభాగం నుంచి ఎఫ్-15ఇ యుద్ధ విమానం తాలూకు ఎయిర్‌మ్యాన్‌ను కాపాడేందుకు అమెరికా చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ చరిత్రాత్మకమని అభివర్ణించారు. అందుకోసం ఏకంగా 155 యుద్ధ విమానాలను రంగంలోకి దించినట్టు చెప్పుకొచ్చారు! దీని గురించి తొలుత రిపోర్ట్ చేసిన అమెరికా జర్నలిస్టు ఓ అత్యంత పనికిమాలిన వ్యక్తి అంటూ అధ్యక్షుడు మండిపడ్డారు. ''అతను చేసిన పని వల్ల రెస్క్యూ ఆపరేషన్ గురించి ఇరాన్‌కు తెలిసిపోయింది. దాంతో అందులో పాల్గొన్న సైనికులందరి ప్రాణాలూ ముప్పులో పడ్డాయి'' అంటూ దుయ్య బట్టారు. సదరు కథనానికి సోర్స్ ఏమిటో బయట పెట్టకుంటే ఆ జర్నలిస్టును జైల్లో పెడతామని హెచ్చరించారు.

**ఇరాన్ షరతులివే!**

- **పశ్చిమాసియాలో అమెరికా–ఇజ్రాయెల్ ఏకపక్షంగా మొదలుపెట్టిన యుద్ధానికి తక్షణం తెర దించాలి**
- **ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ మరింకెప్పటికీ దండెత్తరాదు. ఈ మేరకు ఇరు దేశాలూ స్పష్టమైన హామీలివ్వాలి**
- **ఇరాన్‌పై ఆర్థిక తదితర ఆంక్షలను పూర్తిగా ఎత్తేయాలి**
- **ఇరాన్ పునర్నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులివ్వాలి**
- **హోర్ముజ్‌ను పూర్తిస్థాయిలో తెరవాలంటే మేం రూపొందించే ప్రొటోకాల్స్‌కు**

## రూ.3 వేల కోట్ల విలువైన భూములను కొల్లగొట్టే కుట్ర

విలువైన భూములను కొల్లగొట్టేందుకు యత్నించిన ప్రభుత్వ పెద్దలు.. తాజాగా కోహెడలోని మరో రూ.3 వేల కోట్ల విలువ చేసే 200 ఎకరాల పండ్ల మార్కెట్ భూములను కూడా తమ అనుయాయులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు'అని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు.

ఎమ్మెల్యేలు పి.సబితారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, బండారు లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత క్యామ మల్లేశ్‌తో కలిసి సోమవారం ఆయన కోహెడలో పర్యటించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

భూములను కొల్లగొట్టేందుకే

'కొత్తపేటలోని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్ల మార్కెట్‌ను కట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఆ మేరకు 2020లో జీఓ నంబర్ 11 తీసుకొచ్చి మార్కెట్‌ను నోటిపై చేశాం. భూములు కోల్పోయిన రైతులకు రూ.10 కోట్ల నష్టపరిహారం కూడా చెల్లించాం. జీఓ నంబర్ 216ద్వారా మార్కెట్ ఖాతాలో రూ.350 కోట్లు జమ చేశాం.

రూ.1,000 కోట్ల అంచనాలతో అత్యాధునిక మార్కెట్ యార్డ్‌కు డీపీఆర్ కూడా సిద్ధం చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటింది. ఇప్పటి వరకు తట్టెడు మట్టి తీయలేదు. టీజీఐఐసీ పేరుతో విలువైన ఈ భూములను తమ అనుయాయులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుంది. ఇది పూర్తిగా రైతుల సమస్య. ఏ ప్రభుత్వమైనా రైతుల కోసం పని చేయాలి. కానీ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కమీషన్ల కోసం పనిచేస్తోంది.

'దిల్'భూములను మార్కెట్‌కెలా కేటాయిస్తారు?

ఇక్కడ భూములకు ప్రత్యామ్నాయంగా దిల్ భూముల్లో మార్కెట్ కట్టిస్తాం అంటున్నారు. ఏపీ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలోని డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(దిల్) భూములపై అనేక వివాదాలు ఉన్నాయి. వీటిలో ఏపీ వాటా అడుగుతోంది. ఈ భూములపై కోర్టు కేసులు కూడా ఉన్నాయి. పలువురు పేద రైతులు ఈ భూములపై ఆధారపడి ఉన్నారు. ఎలాంటి వివాదాలు లేని భూములను అనుయాయులకు అప్పగించి.. వివాదాస్పద దిల్ భూములను మార్కెట్‌కు ఎలా కేటాయిస్తారు? రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కన్ను కోహెడ భూములపై పడింది.

ఇప్పటికే లీలా హోటల్ కేంద్రంగా కేరళకు చెందిన నలుగురు దళారులు వీటిని కొల్లగొట్టే ప్రయత్నం మొదలు పెట్టారు. 30 వేల మంది రైతులు కావాలో? లేక ముగ్గురు దళారులు కావాలో? ప్రభుత్వమే తేల్చుకో వాల్సి ఉంది. ఇక్కడ మార్కెట్ నిర్మించకపోతే ఎంత దూరమైనా పోరాడుతాం. రైతుల పక్షాన కొట్లాడుతాం'అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.



## 2034 వరకు మా సర్కారే



అభివృద్ధి విషయంలో అందరినీ కలుపుకొని ముందుకెళ్తాం. అందుకే పార్టీలకు అతీతంగా ఈ సభలకు ఆహ్వానించాం. గత పదేళ్లలో తెలంగాణలో ఇలాంటి సాంప్రదాయం ఎప్పుడైనా చూశారా?. ఇక్కడ కాంగ్రెస్ శాసనసభ్యులు లేకపోయినా బోథ్‌లో, నిర్మల్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మంజూరు చేశాం. మా ఎమ్మెల్యేలు లేకపోయినా ప్రజలు నష్టపోకూడదని అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నాం. పార్టీలు చూడకుండా, ప్రజల కష్టాలు చూసి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం.

జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన

బాసర జ్ఞాన సరస్వతి ఆలయ అభివృద్ధికి రూ.225 కోట్లు మంజూరు చేశాం. అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేస్తాం. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తాం. త్వరలోనే వీలైతే జూన్ 2 నాటికి ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శిలాఫలకం వేసేలా చూస్తాం. ఆదిలాబాద్ ప్రాంతాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం. ఆదిలాబాద్‌లో యూనివర్సిటీకి సంబంధించి భూసేకరణ చేపట్టాం. త్వరలోనే శంకుస్థాపన చేస్తాం. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అభ్యర్థన మేరకు గూడెం సత్యనారాయణస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం.

డిసెంబర్‌లో ఇందిరమ్మ చీరలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఏమేం కావాలో అంచనాలు సిద్ధం చేస్తున్నాం. తెలంగాణ ఆడపడుచులకు వచ్చే డిసెంబర్‌లో ఇందిరమ్మ చీరలు అందజేస్తాం.. చిలుకపచ్చ రంగు చీరలు అందిస్తాం. పేదల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే మా ప్రయత్నం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా సన్న బియ్యం పంపిణీ

'రాష్ట్రంలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. ఇప్పటివరకు దాదాపు రూ.5,400 కోట్లు ఆ ఇళ్లు కట్టుకునే పేదల ఖాతాల్లో వేశాం. ఎన్నడైనా గత ప్రభుత్వం ఇలాంటి ఆలోచన చేసిందా?. సన్న బియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన ఎప్పుడైనా చేసిందా?. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మా ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తోంది. మా ఆడబిడ్డల ఉచిత బస్సు ప్రయాణానికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేశాం. మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు) తయారు చేసిన ఉత్పత్తుల మార్కెటింగ్‌కు హైటెక్ సిటీలో షాపులు కేటాయించాం..' అని సీఎం తెలిపారు.

పిప్రిలో సభ సీఎం ఆలోచనే: డిప్యూటీ సీఎం

'పిప్రిలో బహిరంగ సభ నిర్వహించాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనే.. నా ఆలోచన కాదు..' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలకు సంబంధించి చర్చిస్తున్న క్రమంలో.. ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భారీ బహిరంగ సభ నిర్వహిద్దామని సీఎం అన్నారని చెప్పారు. పిప్రి నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేపట్టి ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు వాటిని మంజూరు చేసి అమలు చేయాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారని వెల్లడించారు. ఆనాడు మండుటెండలో తనతో నడిచి పాదయాత్రను విజయవంతం చేశారని, ఈరోజు కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారని అన్నారు.

ఇది రాజకీయ సభ కాదని ఆనాడు ప్రజలతో ఏర్పర్చుకున్న అనుబంధానికి నిదర్శనం ఈ సభ అని భట్టి చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మంత్రులందరం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని, అంతరాలు లేని సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని చెప్పారు. ఆనాడు టీపీసీసీ అధ్యక్షుడిగా సీఎం రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేతగా మల్లుభట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రలు, బహిరంగ సభలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి దోహద పడ్డాయని ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. అప్పట్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ తెలంగాణను మేటి రాష్ట్రంగా నిలుపుతున్నారని అభినందించారు. వచ్చే ఎన్నికల్లో వందకు పైగా సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

భట్టి పాదయాత్రకు మూడేళ్లు పూర్తి

ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న భట్టి విక్రమార్క, సీఎల్పీ నేతగా రాష్ట్రంలో చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు మూడేళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని.. ఆనాడు భట్టి పాదయాత్ర ప్రారంభించిన పిప్రిలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక బహిరంగ సభను ప్రభుత్వం నిర్వహించింది. కాగా అప్పట్లో ఇచ్చిన హామీల అమలుకు సంబంధించి రూ.614 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు.

ఎస్‌హెచ్‌జీల మహిళలకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, వెడ్మ బొజ్జు, మాలోత్ రాందాస్, ఎమ్మెల్సీ దండే విఠల్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, విజయరమణారావు, బీజేపీ ఎంపీ గొడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

## జైళ్ల శాఖ మంత్రిగా చేశా. ..మీ సమస్యలు నాకు తెలుసు!

ఈకబురు,కుషాయిగూడ (హైదరాబాద్): మత్తు పదార్థాల దుర్వినియోగం తీవ్రమైన సామాజిక, ప్రజా ఆరోగ్య సమస్యగా నిలుస్తోందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా చెప్పారు. తన రాజకీయ జీవితంలో అనేకసార్లు జైళ్లను సందర్శించిన అనుభవం ఉందని ఖైదీలు, జైలు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు తాను అర్థం చేసుకోగలనని పేర్కొన్నారు. గతంలో యూపీలో జైళ్ల శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో జైళ్లలో పరిస్థితుల మెరుగుదలకు, సిబ్బంది సంక్షేమానికి ఎన్నో చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పోలీసు కానిస్టేబుళ్లకు, జైలు వార్డర్లకు సమాన వేతనాలు కల్పించేందుకు కృషి చేసినట్లు చెప్పారు. ఖైదీలకు మానవీయ వాతావరణం కల్పించేందుకు జైళ్లలో ఫ్యాన్లు, టీవీ వంటి సౌకర్యాలు ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. భవిష్యత్‌లో కూడా సంస్కరణాత్మక కారాగార వ్యవస్థను బలోపేతం చేయడంలో తన మద్దతు కొనసాగుతుందని స్పష్టంచేశారు. సోమవారం చర్లపల్లి కేంద్ర కారాగారంలో 'నివృత్తి'మత్తు విముక్తి కేంద్రాన్ని శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు విముక్తి కేంద్రాల వంటి కార్యక్రమాలు నషా ముక్త్ భారత్ అభియాన్ వంటి జాతీయ పథకాల లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. తెలంగాణ కారాగార శాఖ సంస్కరణాత్మక, మానవీయ దృక్పథంతో ముందుకు సాగుతుండటం అభినందనీయమని చెప్పారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఏరియా 77 నేచర్ క్యాంప్, అడ్వెంచర్ పార్క్ ప్రాజెక్టు ఓపెన్ ఎయిర్ జైలు ఖైదీలు, విడుదలైన ఖైదీలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు.

వినోదాత్మక, శిక్షణాత్మక కార్యకలాపాల ద్వారా పునరావాసానికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. జీవనోపాధి కార్యక్రమాల ద్వారా ఖైదీల్లో నైపుణ్యాభివృద్ధి మెరుగుపరచడంతోపాటు బాధ్యతాభావాన్ని పెంపొందించవచ్చని చెప్పారు.

## ఎజెండాలో ఆ రెండే పెండింగ్!

భారత్‌ను స్వయంసమృద్ధంగా, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే బీజేపీ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ''బ్రిటిష్ హయాం నాటి వందలాది నల్ల చట్టాలను వదిలించుకున్నాం. పార్లమెంటు నూతన భవనాన్ని నిర్మించుకున్నాం. జనరల్ కేటగిరీలో పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించుకున్నాం. ట్రిపుల్ తలాక్‌ను నిషేధించుకున్నాం. పౌరసత్వ సవరణ చట్టం తెచ్చాం. అయోధ్యలో రామ మందిరం నిర్మించుకున్నాం. ఇవన్నీ బీజేపీ చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నాల తాలూకు ఫలితాలే'' అని పేర్కొన్నారు. వికసిత భారత నిర్మాణానికి తమ పార్టీ ఎప్పటికీ కట్టుబడి ఉంటుందన్నారు.

కార్యకర్తలే బలం

ఆరెస్సెస్ అనే వటవృక్షం నుంచి పుట్టుకొచ్చిన బీజేపీ జాతీయ సమగ్రత వంటి ఉన్నత లక్ష్యాల సాధనే పరమావధిగా రాజకీయ రంగప్రవేశం చేసిందని మోదీ అన్నారు. రెండు లోక్‌సభ స్థానాలతో మొదలైన బీజేపీ ఎదుగుదల అప్రతిహతంగా సాగిందంటూ గుర్తు చేసుకున్నారు. ''కాంగ్రెస్‌కు అధికారమే పరమావధి. బీజేపీ ప్రస్థానం మాత్రం సేవే పరమార్థంగా కొనసాగుతోంది. నిత్యం సమాజ హితానికి పాటుపడే పార్టీ బీజేపీ. దేశమే ముందన్నది పార్టీ మనసా వాచా నమ్మే సూత్రం.

నిస్వార్థ సేవకు బీజేపీ కార్యకర్తలు పెట్టింది పేరు. బీజేపీ భావజాలం దేశమంతటికీ విస్తరించడంలో వారిదే కీలక పాత్ర. కార్యకర్తల దశాబ్దాల కృషి ఫలితంగానే పార్టీ ఈ స్థాయికి ఎదిగింది'' అంటూ ప్రస్తుతించారు. ''దేశంలో కాంగ్రెస్ పాలనలో బీజేపీ కార్యకర్తలు చెప్పలేనన్ని నిర్బంధాలను ఎదుర్కొన్నారు. హింసే రాజకీయ సంస్కృతిగా మారిన పశ్చిమబెంగాల్, కేరళ వంటి రాష్ట్రాల్లో ప్రాణత్యాగాలు కూడా చేయాల్సి వచ్చింది'' అన్నారు. బీజేపీ కార్యకర్తలకు పార్టీ వ్యవస్థాపక దిన శుభాకాంక్షలు తెలుపు తూ ఎక్స్‌లో కూడా ప్రధాని పోస్టు పెట్టారు.


ఎన్డీఏకు పాతికేళ్లు

సంకీర్ణ రాజకీయాలకు అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన ఘనత బీజేపీదేనని మోదీ అన్నారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి ఆవిర్భావానికి కూడా పాతికేళ్లు నిండాయని గుర్తు చేసుకున్నారు. ''దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఏకైక కూటమి ఎన్డీఏ మాత్రమే. అందరినీ కలుపుకుపోయే తత్వం దాని సొంతం. ప్రాంతీయ ఆకాంక్షలకు పెద్దపీట వేయడం ఎన్డీఏ లక్షణం. దేశవ్యాప్తంగా కూటమి నానాటికీ విస్తరిస్తున్న తీరే ఇందుకు నిదర్శనం'' అని మోదీ ప్రశంసించారు.

''ప్రజలు వారసత్వ రాజకీయాలనూ చూశారు. వామపక్ష రాజకీయాలనూ గమనించారు. వాటితో పోలిస్తే బీజేపీ మోడల్ పాలన అద్వితీయమైనది. విధాన స్థిరత్వం దాని ప్రధాన లక్షణం. భౌగోళిక మార్పులు, చొరబాట్లు, అవినీతికి అడ్డుకట్ట, బానిస మనస్తత్వం నుంచి ప్రజలకు ముక్తి వంటివి బీజేపీతోనే సాధ్యం. ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమన్నారు. మేం దాన్ని సుసాధ్యం చేసి చూపించాం. జాతీయ భద్రత, ఉగ్రవాదం వంటి కీలకాంశాలపై బీజేపీది ఎప్పుడూ స్థిరమైన వైఖరే'' అని స్పష్టం చేశారు.

మహిళా పక్షపాతి

బీజేపీ మహిళా పక్షపాతి అని మోదీ స్పష్టం చేశారు. 1994లో తొలిసారిగా మహిళా రిజర్వేషన్ల అంశాన్ని లేవనెత్తింది తమ పార్టీయేనని గుర్తు చేశారు. 2029 సాధారణ ఎన్నికల నుంచి లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్టు స్పష్టం చేశారు. పార్టీలో కూడా మహిళలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు.



## 'భవ్య బాసర'కు భూమిపూజ

ఈకబురు,నిర్మల్: దేశంలోని ఏకైక సరస్వతీ క్షేత్రమైన బాసరను భవ్యమైన ఆలయంగా పునరాభివృద్ధి చేసేందుకు రూ.225 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆ పనులకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ముధోల్ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో నిర్మించే యంగ్ ఇండియా స్కూల్‌కు సీఎం శంకుస్థాపన చేశారు.

కుటుంబసభ్యులు, మంత్రులతో కలిసి..

ముఖ్యమంత్రి ఉదయం 11.42 గంటలకు సతీమణి గీతారెడ్డి, కుమార్తె, అల్లుడు, మనవడు రియాన్ష్, మంత్రులతో కలిసి రెండు హెలికాప్టర్లలో బాసరకు చేరుకున్నారు. ముందుగా ఆలయంలో అమ్మవారి ఎదుట వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య రియాన్ష్‌కు తన సతీమణితో కలిసి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం సరస్వతీ, మహాలక్ష్మీ, మహంకాళీ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం, దేవాదాయ శాఖ అధికారుల సత్కారం స్వీకరించారు. తర్వాత మంత్రులతో కలిసి ఆలయ ప్రాంగణంలో తూర్పు ముఖద్వారం పక్కన మాస్టర్‌ప్లాన్ ప్రకారం చేపట్టనున్న విశాలమైన నూతన ఆలయానికి భూమిపూజ నిర్వహించారు.

అక్కడే యంగ్ ఇండియా స్కూల్‌కు కూడా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీలు గొడం నగేశ్, వేం నరేందర్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్, ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దండె విఠల్, చిన్నమైల్ అంజిరెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల, ఆలయ ఇన్‌చార్జి ఈవో విజయరామారావు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి మౌనం

బాసర పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడా మాట్లాడలేదు. మీడియాను ఆలయంలోకి అనుమతించలేదు. బాసరలోనే ఉన్న ట్రిపుల్ ఐటీ సమస్యలపై స్పందిస్తారని, నిర్మల్ జిల్లాలో ఏర్పాటు చేస్తానన్న యూనివర్సిటీ గురించి ముఖ్యమంత్రి మాట్లాడతారని భావించినా భూమిపూజ, మనవడి అక్షరాభ్యాస కార్యక్రమాలకే పరిమితమయ్యారు. లంచ్ టైమ్‌లో కాసేపు నిర్మల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో మాట్లాడారు.

## గద్దర్‌ను జాతిపితగా ప్రకటించకపోతే..

# తెలంగాణ సమాజం నష్టపోతది

### కేసీఆర్ జాతిపితగా ప్రచారం చేసుకుంటే ప్రభుత్వం ఏమీ చెయ్యలే


తెల్లాపూర్ లోని గద్దర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న కంచె ఐలయ్య, విమలక్క తదితరులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కంచె ఐలయ్య

- గాంధీ ఒక్క గుండుతో జాతిపిత అయితే.. ఆరు గుండ్లు తిన్న గద్దర్ తెలంగాణకు జాతిపితనే
- తెల్లాపూర్‌లో జరిగిన గద్దర్ పునర్జీవన్ సభలో ప్రొఫెసర్ కంచె ఐలయ్య

ఈకబురు, పటాన్ చెరు :
జాతిపిత అనేది ఒక మోరల్ బిరుదు.. ఎన్ని కోట్లిచ్చి ఓట్లు వేయించుకున్నా, కోట్లు పంచి కొనుక్కున్నా దక్కే సీటు కాదు అని ప్రొఫెసర్ కంచె ఐలయ్య షెపర్డ్ అన్నారు. వందల ముఖ్య మంత్రుల సీటు కన్నా జాతిపిత అనే హోదా ఎంతో గొప్పదని పేర్కొన్నారు. గద్దర్‌ను జాతిపితగా ప్రకటించకపోతే తెలంగాణ సమాజం శాశ్వతంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ కేంద్రంలో సోమవారం గద్దర్ పునర్జీవన్ పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గద్దర్ గళం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మేధావులు, సామాజిక వేత్తలతో పాటు గద్దర్ కూతరు, తెలంగాణ సాంస్కృతిక శాఖ చైర్ పర్సన్ వెన్నెల, ప్రజా సంఘాల నేత విమలక్క, పాశం యాదగిరి, గద్దర్ గళం వ్యవస్థాపకులు కొల్లూరి సత్తయ్య, కార్యక్రమ నిర్వాహకుడు మాజీ కౌన్సిలర్ భరత్ తదితరులు హాజరయ్యారు. 1997 ఏప్రిల్ 6న గద్దర్ పై తుపాకి దింపిన రోజును నిరసిస్తూ ఈ పునర్జీవన్ సభ ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కంచె ఐలయ్య రౌండ్ టేబుల్ మీటింగ్‌లో ఆసక్తికర ప్రసంగం ఇచ్చారు. ఫిబ్రవరి 17న రాష్ట్రమంతా కేసీఆర్ జాతిపిత హోర్డింగులు, కటౌట్లు, బ్యానర్లు వేయించుకున్నాడని, కానీ తెలంగాణ ప్రభుత్వం నుండి కాని సీఎం రేవంత్ రెడ్డి నుండి కాని ఎలాంటి సమాధానం లేదని అన్నారు. వచ్చే ఆగస్టు 6న గద్దర్ వర్ధంతి లోపు.. పెద్ద బహిరంగ సభ ఏర్పాటు చేసి గద్దర్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ఈ పని చేయకపోతే ప్రజలు క్షమించరని, మంచి మనిషి గద్దర్‌కు జాతిపిత హోదా దక్కకపోతే జాతిపితగా ప్రకటించుకుంటున్న వ్యక్తే మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఎలాంటి పదవిలో లేని గాంధీని గాడ్సే హత్య చేశాడని, చావు అనే త్యాగం చేసిన గాంధీ ఉండగా కేసీఆర్ నేనే జాతిపితనని ప్రకటించుకోవడం అన్యాయమని వాఖ్యానించారు. పవర్‌లోకి రాగానే కొడుకును, బిడ్డను దింపి పదేళ్లలో వందల, వేల ఎకరాల భూములు, లెక్కలేన్ని ఫామ్ హౌజ్‌లు సంపాదించారని ఆరోపించారు. ఒక్క కాళేశ్వరంలోనే లక్ష కోట్ల అవినీతి జరిగిందని విచారణ చేపడితే కేసీఆర్ మాత్రం జాతిపితగా ప్రకటించుకోవడం చూసి పిచ్చెంక్కిందన్నారు. అసలు జాతిపితను పట్టుకోవాలనే సంకల్పంతో గద్దర్ జీవితంలో వెణక్కి వెళ్లి చూశానని అప్పుడే గాంధీకి, గద్దర్‌కు సారూప్యతను గమణించానని ఐలయ్య తెలిపారు. ఎలాంటి పదవి, డబ్బు సంపాధించుకోని గాంధీ లాగే గద్దర్ కూడా నిస్వార్థ ఉద్యమం చేశాడని, గాంధీ మాదిరిగానే కాల్పులకు గురయ్యాడని చెప్పారు. ఒక్క గుండు దిగిన గాంధీ జాతిపిత అయ్యిందు.. ఆరు గుండ్లు దింపుకున్న గద్దర్ ఎందుకు జాతిపిత కాదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్‌ను జాతిపితగా ప్రకటించి, తెలంగాణ సమాజం దృష్టితో చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన కోరారు.


తెల్లాపూర్ లోని గద్దర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న కంచె ఐలయ్య, విమలక్క తదితరులు

## దొంగ ఎల్ఆర్ఎస్ ను వెంటనే రద్దు చేయాలి

### కసిరెడ్డి భాస్కర్ రెడ్డి

#### స్థానికులతో కలిసి జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో ఫిర్యాదు


స్థానికులతో కలిసి జోనల్, సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న భాస్కర్ రెడ్డి


స్థానికులతో కలిసి జోనల్, సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న భాస్కర్ రెడ్డి

ఈకబురు, శేరిలింగంపల్లి : ఒక సర్వే నెంబరులో రిజిస్ట్రేషన్ చేసుకుని, మరో సర్వే నెంబర్లులో ఉన్న పార్కు స్థలాన్ని చూపించి చేసుకున్న దొంగ ఎల్ఆర్ఎస్ ను వెంటనే రద్దు చేయాలని జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు చందానగర్ లోని పలు కాలనీలకు చెందిన స్థానికులతో కలిసి శేరిలింగంపల్లి జౌనల్, మియాపూర్ సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఫిర్యాదు చేశారు .ఈ సందర్భంగా కసిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండల పరిధిలోని చందానగర్ సర్వే నెంబరు 125లో ఉన్న భూమి పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకుని, సర్వేనెంబర్ 267లో ఉన్న పార్కు స్థలాన్ని చూపిస్తూ దొంగ ఎల్ఆర్ఎస్ చేసుకున్నారని అన్నారు. అధికారులు సరైన విచారణ చేపట్టకుండా చేసిన ఎల్ఆర్ఎస్ నెంబర్ 1206/ సీఆర్12/westzone/2013ను వెంటనే రద్దు చేసి సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక కాలనీ అసోసియేషన్ల సభ్యులు ఇప్పటికే పలు మార్లు ఫిర్యాదు చేసినా.. అధికారులు చర్యలు తీసుకోవడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. పార్కులను కాపాడే విషయంలో మరింత శ్రద్ధ చూపాలని, అక్రమ మార్గాలతో కబ్జాలకు పాల్పడే వారికి తగిన గుణపాఠం చెప్పాలని అభిప్రాయపడ్డారు. వెంటనే సదరు ఎన్ఆర్ఎస్ ను రద్దు చేయడంతో పాటు న్యాయస్థానంలో ఉన్న కేసులో తగిన విధంగా కౌంటర్ దాఖలు చేయాలని సూచించారు. ఫ్రెండ్స్ కాలనీ, డిఫెన్స్ కాలనీ, అర్జున్ రెడ్డి కాలనీల మధ్యలో ఉన్న పార్కును కాపాడాలని.. ఇక్కడ నివాసం ఉంటున్న వేలాది మంది స్థానికులకు ఉపయోగపడే విధంగా పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. అధికారులను కలిసిన వారిలో కసిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు పలు కాలనీల అసోసియేషన్ల సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు

## గ్రాండ్ ట్రంక్ రూట్‌లో 120 కొత్త రైళ్లు!

ఈకబురు, హైదరాబాద్: దక్షిణ-ఉత్తర భారత్‌లను జోడించే ప్రధాన గ్రాండ్ ట్రంక్ కారిడార్ అయిన బల్లార్షా-విజయవాడ మార్గంలో 120కిపైగా కొత్త రైళ్లు పట్టాలెక్కేందుకు వెసులుబాటు కలిగింది. బల్లార్షా-కాజీపేట-విజయవాడ-గూడూరు మధ్య మూడో లైన్ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. మరో 38 కి.మీ. నిడివిలో మాత్రమే పనులు మిగిలి ఉన్నాయి. ఈ ఏడాది చివరి నాటికి అవి కూడా పూర్తయి మొత్తం కారిడార్ సిద్ధం కానుంది.
ఇప్పటికే సిద్ధమైన 700 కి.మీ. మూడో లైన్ వినియోగంలోకి రావడంతో గత ఏడాది కాలంలో ప్రయాణికులకు విడతల వారీగా 36 కొత్త రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. మరో 50 గూడ్సు రైళ్లు కూడా పట్టాలెక్కాయి. మిగతా పనులు పూర్తయితే మరో 50 రైళ్లు కొత్తగా పట్టాలెక్కించేందుకు రైల్వే బోర్డు ఏర్పాట్లు చేస్తోంది.
ఇక, ఆ కారిడార్ మొత్తాన్ని వందేభారత్ రైళ్లు గరిష్ట వేగంతో దూసుకుపోయేలా 130-150 కి.మీ. వేగాన్ని తట్టుకునే సామర్థ్యానికి ట్రాక్‌ను బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మూడో లైన్, ట్రాక్ బలోపేతం పనుల్లో జాప్యం లేకుండా తాజాగా రైల్వే శాఖ దక్షిణ మధ్య రైల్వేకు భారీగానే నిధులు కేటాయించింది.

**రూ. 13,026 కోట్ల నిధులు...**

ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వేకు మౌలిక వసతుల మెరుగు కోసం రూ.13,026 కోట్లు కేటాయించింది. ఇది అంతకుముందు బడ్జెట్ కేటాయింపు రూ.11,012 కంటే 18% అధికం కావడం విశేషం. బడ్జెట్ సమయంలో ఈ వివరాలను వెల్లడించని రైల్వే అధికారులు తాజాగా ఆ అంకెలను విడుదల చేశారు. ఈ మొత్తం నుంచి కొత్త లైన్ల కోసం రూ.1,315 కోట్లు , డబ్లింగ్ కోసం రూ.5083 కోట్లు, ట్రాక్ పునరుద్ధరణ కోసం రూ.1,908 కోట్లు, ట్రాఫిక్ వసతుల అప్‌గ్రెడేషన్ కోసం రూ.403 కోట్లు, రోడ్డు భద్రతా పనుల కోసం రూ. 683 కోట్లు ప్రకటించారు. గత ఏడాది కాలంలో జోన్ పరిధిలో కొత్తగా 194.57 కిలోమీటర్ల మేర ట్రాక్ ఏర్పాటు చేయగా, ఈ సారి ఆ నిడివి మరింత ఎక్కువ ఉండనుంది. బాసర-నవీపేట మధ్య 17 కి.మీ. మధ్య డబ్లింగ్ పూర్తి కాగా, కాజీపేట వద్ద బైపాస్ లైన్ (21.46 కి.మీ.), వాడి వద్ద బైపాస్ లైన్ (22.70 కి.మీ.) , తాండూరు వద్ద 'వై'ఆకృతి బైపాస్ అనుసంధానం (1.95కి.మీ), పెద్దపల్లి వద్ద బైపాస్ లైన్ ( 2.17 కి.మీ).
బల్లార్షా -మాణిక్‌ఘర్ మధ్య మూడో లైన్(6.91 కి.మీ.), రెచ్ని రోడ్ -బెల్లంపల్లి మధ్య( 9.636 కి.మీ.), బెల్లంపల్లి-మందమర్రిమధ్య(7.52 కి.మీ.), మోట మర్రి- మధిర (5.80 కి.మీ.) మధ్య, మహబూబాబాద్ -నెక్కొండ (30.416 కి.మీ.) మధ్య, ఖమ్మం -డోర్నకల్ (19.59 కి.మీ.) మధ్య మూడో లైన్ పూర్తయింది.
ఏడాది కాలంలో 325 కిలోమీటర్ల మేర ట్రాక్ విద్యు దీకరణ కూడా పూర్తయింది. గత రెండేళ్లలో పనుల్లో వేగం వల్ల గూడూరు -విజయవాడ-కాజీపేట- బల్లా ర్షా మధ్య 700 కి.మీ. మూడో లైన్ అందుబాటులోకి వచ్చింది. పెదవడ్లపూడి -కృష్ణా కెనాల్ మధ్య 7 కి.మీ., డోర్నకల్-మహబూబాబాద్ మధ్య 20 కి.మీ., సిర్పూర్ కాగజ్‌నగర్-ఆసిఫాబాద్ మధ్య 11 కి.మీ. మేర పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. కొత్త బడ్జెట్ నిధులు మెరుగ్గానే ఇవ్వడంతో ఈ పనులు ఈ ఏడాది చివరిలోపే పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**మరింత వేగంగా రైళ్లు...**

వందేభారత్ రైలు 160 కి.మీ. వేగంతో దూసుకెళ్లే అవకాశం ఉన్నా, ట్రాక్ పటుత్వం తక్కువగా ఉండడంతో ప్రస్తుతం సగటు వేగం 90 కి.మీ.లోపే. దీంతో ట్రాక్ సామర్థ్యాన్ని 130-160 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా పటిష్ట పరచాల్సి ఉంది. కానీ, రెండు లైన్లు మాత్రమే ఉండి, నిరంతరం వచ్చిపోయే రైళ్లతో బిజీగా ఉండటంతో పనులు చేపట్టేందుకు వీలు కలగలేదు. ఇప్పుడు మూడో లైన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుండడంతో, రైళ్లను రెండు లైన్లకు పరిమితం చేస్తూ మూడో లైన్‌ను పటిష్ట పరిచేందుకు వీలు కలగనుంది.

## ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ బిజెపి : గంగాధర్ రెడ్డి


జెపి జెండాలను ఆవిష్కరిస్తున్న గంగాధర్ రెడ్డి తదితరులు


జెపి జెండాలను ఆవిష్కరిస్తున్న గంగాధర్ రెడ్డి తదితరులు

- గచ్చిబౌలి డివిజన్‌లో ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- నానక్‌రామ్‌గూడ, గౌలిదొడ్డిల్లో బీజేపీ జెండాలను ఆవిష్కరించిన గంగాధర్ రెడ్డి

ఈకబురు, శేరిలింగంపల్లి : క్రమశిక్షణ గల కార్యకర్తలు, దేశ అభివృద్ధిపై దూరదృష్టితో ఆలోచించే నాయకుల కృషితో భారతీయ జనతా పార్టీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని గచ్చిబౌలి డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ వి .గంగాధర్ రెడ్డి అన్నారు. భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గచ్చిబౌలి డివిజన్ పరిధిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డిలో సీనియర్ నాయకులు కిషన్ గౌలి ఆధ్వర్యంలో, నానక్‌రామ్‌గూడలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు శివ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ 1980 ఏప్రిల్ 6న స్థాపించబడినప్పటి నుండి సాధారణ కార్యకర్తల శక్తితో ఎదుగుతూ దేశ రాజకీయాల్లో కీలక శక్తిగా అవతరించిందన్నారు. ప్రారంభ దశలో కేవలం 2 ఎంపీ స్థానాలతో ప్రారంభమైన పార్టీ, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ క్రమంగా తన బలాన్ని పెంచుకుందని తెలిపారు. అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తన సత్తాను చాటుకున్న బీజేపీ, అనంతరం నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అఖండ విజయాలను సాధిస్తూ పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి దేశ అభివృద్ధికి కొత్త దిశను చూపుతోందన్నారు. సబ్కా సాథ్.. సబ్కా వికాస్.. సబ్కా విశ్వాస్... అనే సిద్ధాంతంతో అన్ని వర్గాల అభ్యున్నతిని లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో
గత గత పదేళ్లలో దేశానికి సుపరిపాలన అందించడమే కాకుండా ప్రజల ఆత్మగౌరవాన్ని పెంపొందించిందని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి, పారదర్శకత, సంక్షేమం లక్ష్యాలుగా దేశాన్ని ముందుకు నడిపిస్తూ గ్రామీణాభివృద్ధి, డిజిటల్ ఇండియా, స్వచ్ఛ భారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి వర్గానికీ న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కార్యకర్త నిబద్ధత, త్యాగం, సేవాభావంతో పార్టీ మరింత శక్తివంతంగా ఎదగాలని కోరుకుంటూ, నాయకులు, కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాష్ట్ర, జిల్లా, నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీరు ఉంటే... సంపద ఉన్నట్లే

పరిగెత్తే నీటిని నిలబెట్టాలి, నిలబడిన నీటిని నిల్వ చేయాలి..నిలబడిన నీటిని జలాశయంలో చేసేందుకు ప్రయత్నించాలి. నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం లాంటి అనేక ప్రయత్నాలు చేసి ముందుకు వెళ్లాం. పంట కుంటలు, కాలువలు, చెరువుల్లో మట్టి తీసి పొలాలకు వేశాం. ఎన్టీఆర్ జలసిరి ద్వారా ట్రెంచ్‌లు, నీరు చెట్టు, నీరుమీరు, నీరుప్రగతి లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టాం. నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల లాంటి భాగస్వాములతో ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నాం. అనంతపురం లాంటి ప్రాంతాల్లో కొన్ని ఏళ్లపాటు నీరే లేదు. నష్ట పోతున్న రైతులను ఆదుకోడానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చింది కూడా టీడీపీనే. అనంతపురం జిల్లాలో నీటిని సద్వినియోగం చేసుకోవాలని డ్రిప్ ఇరిగేషన్ కార్యక్రమం తీసుకువచ్చాం. 90 శాతం మేర సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఇచ్చింది కూడా గతంలో మేమే. మైక్రో ఇరిగేషన్‌పై గతంలో ఇచ్చిన నివేదికే ప్రామాణికంగా మారి దేశంలో అంతా వినియోగించే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు వ్యయం చేస్తూ దేశంలో నెంబర్ వన్‌గా ఉన్నాం. డ్రిప్ ఇరిగేషన్ వల్లే రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మారింది. హార్చికల్చర్‌లో దేశంలో అగ్రస్థానంలో ఉన్నాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**పూర్వోదయతో సీమ అభివృద్ధి...** రాయలసీమ అభివృద్ధికి ఒక ప్లాన్ ప్రకారం ముందుకెళ్తున్నామని, కేంద్రం ప్రవేశపెట్టిన పూర్వోదయ పథకం ద్వారా రూ.30 వేల కోట్లు వస్తాయన్నారు. 'పెట్టుబడులు ద్వారా మరో రూ.70 వేల కోట్ల రాబట్టి అభివృద్ధి చేస్తాం. గడిచిన 21 నెలల్లో నీటి భద్రతా పరంగా చాలా మార్పులు వచ్చాయి. చెరువులు పెద్ద ఎత్తున నింపగలిగాం. జల సంరక్షణా చర్యల కారణంగా భూగర్భ జలాలను 1.92 మీటర్ల మేర పెంచగలిగాం. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3 మీటర్లుగా భూగర్భజలాలున్నాయి. అనంతపురం జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే ఇప్పుడు 11 మీటర్లకే భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చాయి. చేపట్టిన భూసంరక్షణ చర్యల కారణంగా 2.2 మీటర్ల మేర జలాలు పెరగటం సంతోషం కలిగిస్తోంది. అన్నమయ్య జిల్లాల్లో దీనిని ఓ ప్రజాఉద్యమంగా చేపట్టి విజయం సాధించారు. ఈ ఉద్యమంలో ప్రజలందరికీ నేను తోడుగా ఉంటాను. జిల్లాలో 5.7 టీఎంసీల నీళ్లు అందుబాటులోకి వచ్చాయి. 20 వేలకుపైగా ఎండిన బోర్లలో నీరు అందుబాటులోకి వచ్చింది. ఒక్క జిల్లాలో రూ.96 కోట్ల మేర విద్యుత్ ఆదా అయ్యింది. భూగర్భజలాలు పెరగటం మూలంగా హరిత ప్రాంతం పెరిగింది. ఇవన్నీ సానుకూలమైన అంశాలు' అని సిఎం అన్నారు.

## భారత్‌ను కేంద్రప్రభుత్వం చీకటిలో ఉంచుతోంది

అమెరికాతో కుదుర్చుకొన్న వాణిజ్య ఒప్పందాలపై పారదర్శకత పాటించడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం వల్ల మన ఆరోగ్య, ఆర్థిక, ప్రభుత్వ డేటాబేస్‌లు భారత్‌లోనే ఉంటాయా? లేదా విదేశీ కంపెనీలకు మన డేటా సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెడుతున్నారా? అని రాహుల్ ప్రశ్నించారు. భారతదేశపు డేటా ప్రజలకే చెందుతుందని, కృత్రిమ మేధ(ఏఐ) రేసులో భారత్ ముందుండాలంటే మన డేటాను మనమే రక్షించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..



పెళ్లిళ్లు, శుభకార్యాలు అనగానే ముందుగా గుర్తొచ్చేది బంగారమే. అంతగా మన సంస్కృతి, సంప్రదాయాలతో ముడిపడిపోయింది ఈ లోహం. అంతేకాదు.. పెట్టుబడికి పెట్టాలనుకునే వారికి పసిడి మంచి సాధనం. పసిడితో పాటు వెండికీ మంచి గిరాకీనే ఉంది. అందుకే వీటి ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. మరి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖ నగరాల్లో వాటి ధరలు ఎలా ఉన్నాయో చూడండి..


**బంగారం గురించి..** బంగారం స్వచ్ఛతను క్యారట్లల్లో కొలుస్తారు. క్యారట్ల వాల్యూ పెరిగే కొద్దీ బంగారం స్వచ్ఛత, ధర పెరుగుతాయి. మేలిమి బంగారాన్ని 24 క్యారట్లుగా (24 carat Gold) చెబుతారు. అంటే ఇది 99.9 స్వచ్ఛమైన బంగారమన్నమాట. ఇది కాయిన్స్ (Gold Coins), బార్స్, బిస్కెట్ల రూపంలో మాత్రమే దొరుకుతుంది.నగల తయారీకి 22 క్యారట్ల స్వచ్ఛతతో కూడిన బంగారాన్ని వినియోగిస్తారు. ఇందులో ఇతర లోహాలు కలుపుతారు. బంగారంతో చేయించుకునే ఆభరణాలన్నీ 22 క్యారెట్లు/916 స్వచ్ఛతతో ఉంటాయి. ఈ ధర కోసం మేలిమి బంగారం ధరను 91.6 శాతంతో గుణిస్తే సరిపోతుంది.బంగారం, వెండి వంటి విలువైన లోహాల ధరలు అంతర్జాతీయ విపణికి అనుగుణంగానే ఉంటాయి. అక్కడ పెరిగితే ఇక్కడా పెరుగుతుంది. తగ్గినా అంతే. మన దేశం బంగారం కోసం దాదాపుగా దిగుమతులపైనే ఆధారపడినందున డాలర్ మారకపు విలువ కూడా దేశీయంగా పుత్తడి ధరలపై ప్రభావం చూపుతుంది. కొన్ని దుకాణాలు, ప్రాంతాల్లో పన్నులు, సుంకాలు ముందుగా కలపకుండా లోహాల ధరలను ప్రకటిస్తుంటాయి. దీనివల్ల ధర తక్కువగా కనపడుతుంది. ఆభరణం నచ్చి, బిల్లు వేయమన్నప్పుడు, పన్నులు/సుంకాలు కలిపితే.. ఏ ప్రాంతంలో అయినా బంగారానికి ఒకటే ధర అవుతుంది. ఆభరణం తయారీ, తరుగు ఛార్జీల్లో మాత్రం ప్రతి దుకాణానికీ తేడా ఉంటుంది.కొంతమంది వ్యాపారులు బిల్లు లేకుండా విక్రయిస్తాం.. అప్పుడు 3 శాతం జీఎస్టీ కట్టాల్సిన అవసరం ఉండదని చెబుతుంటారు. అయితే బిల్లు లేకుండా కొంటే కొన్ని చిక్కులు ఎదుర్కోవాలి. బంగారం నాణ్యత సరిగా లేకుంటే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ఆభరణం మరమ్మతులకూ బాధ్యత వహించరు. కాబట్టి బంగారం కొనేటప్పుడు బిల్లు ముఖ్యం.

## 3 కోట్ల వాహన రిటెయిల్ విక్రయాలు



భారతీయ వాహన రిటెయిల్ రంగానికి 2025-26 ఒక మైలురాయిలా నిలిచింది. దేశీయంగా అన్ని విభాగాల్లో కలిపి దాదాపు 3 కోట్ల వాహనాలు విక్రయమైనట్లు వాహన డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడించింది. 2025-26లో మొత్తం 2,96,71,064 వాహనాలు రిటెయిల్‌గా విక్రయమయ్యాయి.2024-25లో విక్రయించిన 2,61,87,255 వాహనాల కంటే ఇవి 13.3% ఎక్కువ. '6 వాహన విభాగాల్లో 5 సరికొత్త రికార్డులు నమోదు చేశాయి. జీఎస్టీ 2.0 సంస్కరణలు, ఆదాయపు పన్ను పరిమితి పెంచడం, పండగ గిరాకీ, కొనుగోలు సామర్థ్యం పెరగడం, విద్యుత్తు హైబ్రిడ్ మోడళ్ల వంటివి వాహన విక్రయాలు పెరగడానికి దోహదం చేశాయి. పశ్చిమాసియా యుద్ధ పరిణామ ప్రభావాలపై అప్రమత్తంగా ఉన్నామ'ని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ వెల్లడించారు.

## సీజ్ ఫైర్‌పై ఆశలు.. నష్టాల నుంచి భారీ లాభాల్లోకి సూచీలు



దేశీయస్టాక్ మార్కెట్ సూచీలు యూటర్న్ తీసుకున్నాయి. సోమవారం ఉదయం నష్టాల్లో ట్రేడైన సూచీలు.. మధ్యాహ్నం తర్వాత లాభాల్లోకి వచ్చాయి. అమెరికా ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలు మార్కెట్ రికవరీకి దోహదం చేశాయి. సెన్సెక్స్ కనిష్ఠాల నుంచి 1378 పాయింట్ల మేర కోలుకుంది. దీంతో మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లు పెరిగి రూ.427 లక్షల కోట్లకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 73,477.53 (క్రితం ముగింపు 73,319.55) పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 72,728.66 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. కాల్పుల విరమణకు సంబంధించిన వార్తలు రావడంతో లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 74,207.46 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 787.30 పాయింట్ల లాభంతో 74,106.85 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 255.15 పాయింట్ల లాభంతో 22,968.25 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93.05గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్, ఎల్అండ్‌టీ, అల్ట్రాటెక్ సిమెంట్ స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, సన్‌ఫార్మా స్టాక్స్ నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4689 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవీ..** ఇరాన్‌అమెరికా మధ్య శాంతి చర్చలు: పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్, అమెరికా మధ్య కాల్పుల విరమణ కోసం ఒక ఒప్పంద ప్రణాళిక సిద్ధమైనట్లు వచ్చిన వార్తలు ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపాయి. హార్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్యం మళ్లీ ప్రారంభమయ్యే అవకాశం ఉండటం మార్కెట్‌కు పాజిటివ్‌గా మారింది.

**తగ్గిన క్రూడాయిల్:** శాంతి చర్చల వార్తలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 110 డాలర్ల కంటే దిగువకు చేరింది. ఇది మన దేశ ఆర్థిక వ్యవస్థకు, ద్రవ్యోల్బణం నియంత్రణకు ఉపకరిస్తుంది.

**పుంజుకున్న రూపాయి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చర్యల వల్ల అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 93.04 స్థాయికి వచ్చింది. కరెన్సీ మార్కెట్‌లో ఒడుదొడుకులు తగ్గడం స్టాక్ మార్కెట్ రికవరీకి దోహదపడింది. దీనికితోడు ఆసియా మార్కెట్లైన జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కోస్పి రాణించడమూ మన మార్కెట్ సూచీలకు కలిసొచ్చింది.

# 2030కి మరో 25 లక్షల ఉద్యోగాలు

### ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాల్లో అడెకో ఇండియా నివేదిక

దేశీయ ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాల్లో 2030 నాటికి 2025 లక్షల కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఉద్యోగ కన్సల్టెన్సీ సంస్థ అడెకో ఇండియా అంచనా వేసింది. ఈ రెండు రంగాలు సామర్థ్యఆధారిత వృద్ధి దశలోకి ప్రవేశిస్తున్నాయని పేర్కొంది. కార్మిక శక్తిలో 3035% మందికి నైపుణ్యాల పునఃశ్చరణ అవసరమని తెలిపింది. ఆసుపత్రులు, ఆయుష్, వృద్ధుల సంరక్షణ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, డయాగ్నొస్టిక్స్, టెలిమెడిసిన్, క్లినికల్ పరిశోధన, పబ్లిక్ హెల్త్ సిస్టమ్స్ వంటి రంగాల్లో నియామకాలు ఎక్కువగా స్పెషలైజేషన్, టెక్నాలజీ నైపుణ్యాలున్న వారికి లభిస్తాయని నివేదిక వివరించింది. 100 మందికి పైగా క్లయింట్ల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు అడెక్కో తెలిపింది. విశ్వసనీయ మార్కెట్ పరిశోధన ఆధారాలు కూడా తోడయ్యాయి. ఈ నివేదిక ప్రకారం.. ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాల్లో వృద్ధి ఆర్థిక ప్రాబల్యంతో ముడిపడి ఉంటుంది. ఇది 2022లో జీడీపీలో 3.3 శాతంగా ఉండగా.. క్లినికల్ పరిశోధనా కార్యకలాపాలు, డిజిటల్ ఆరోగ్య స్వీకరణ, ఫార్మాస్యూటికల్ అభివృద్ధి, తయారీని ప్రపంచ వ్యాప్తంగా నిరంతరం అవుట్‌సోర్సింగ్ చేయడం వంటి వాటి మద్దతుతో 2030 నాటికి 5 శాతానికి చేరుకుంటుందని అడెక్కో ఇండియా అంచనా వేసింది. డయాగ్నొస్టిక్స్, ప్రివెంటివ్ హెల్త్‌కేర్, టెలిమెడిసిన్ వంటివి రెండో, మూడో అంచె పట్టణాలకూ విస్తరిస్తుండటంతో వీటికి గిరాకీలో 2025% పెరుగుదల ఉంటుంది. సంక్లిష్ట జనరిక్స్, స్పెషాల్టీ థెరపీల, బయోలాజిక్స్ వైపు జరుగుతున్న మార్పునకు అనుగుణంగా, అధునాతన ఆర్ అండ్ డీ, రెగ్యులేటరీ ఉద్యోగాల కోసం నియామకాలు 2530% పెరుగుతాయి.నియామకాల్లో 6570% బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, చెన్నై, దిల్లీఎన్‌సీఆర్‌లలోనే కేంద్రీకృతమై ఉంటాయి. ఆసుపత్రి నెట్‌వర్క్‌లు, తయారీ క్లస్టర్‌లు, వికేంద్రీకృత డెలివరీ నమూనాల విస్తరణ మద్దతుతో పుణె, అహ్మదాబాద్, కోయంబత్తూర్ వంటి రెండో, మూడో అంచె నగరాల్లోనూ ఈ నియామకాలు క్రమంగా పెరుగుతున్నాయని అడెక్కో ఇండియా అసోసియేట్ డైరెక్టర్, హెడ్ ఆఫ్ సేల్స్‌పర్మనెంట్ రిక్రూట్‌మెంట్ పీయుష్ సప్రూ వెల్లడించారు.



# ఐటీలో మూలాల నుంచే ప్రక్షాళన

### ఏఐతో ఉత్పాదకత పెరిగింది
### నైపుణ్యాలు పెంచకపోతే సామాజికంగా ఇక్కట్లు
### టీంలీజ్ డిజిటల్ సీఈఓ నీతి శర్మ

ఐటీ రంగంలో చోటుచేసుకుంటున్న ఉద్యోగాల కోతకు కాలానుగుణ మార్పులు ఆర్థిక కారణాలే కారణం కాదని, మూలాల నుంచే ప్రక్షాళన జరుగుతోందని టీమ్‌లీజ్ డిజిటల్ సీఈఓ నీతి శర్మ తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో తక్కువ మంది సిబ్బందితోనే, కంపెనీలు అధిక ఉత్పాదకత సాధిస్తున్నాయని.. ఇందువల్లే అధిక నైపుణ్యాలు కలిగిన వారిని నియమించుకునేందుకు, కొనసాగించేందుకు మొగ్గుచూపుతున్నాయని పేర్కొన్నారు. టెక్ రంగంలో ప్రస్తుత పరిణామాలపై ఆమె పంచుకున్న అభిప్రాయాలు, విశ్లేషణలు ఇలా ఉన్నాయి..

**అప్పుడు అధిక నియామకాలు.. ఇప్పుడు కోతలు:** 'ఉద్యోగాల కోతకు సంబంధించి ట్రాకింగ్ చేసే 'లేఆఫ్స్.ఎఫ్‌వైఐ' గణాంకాల ప్రకారం 2026లో ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా 70కి పైగా టెక్ కంపెనీలు 40,480 మంది ఉద్యోగులను తొలగించాయి. కరోనా పరిణామాల్లో ఒక్కసారిగా లభించిన గిరాకీకి అనుగుణంగా కంపెనీలు నియామకాలు అధికంగా చేపట్టాయి. ఇప్పుడు ఐటీ వ్యయాల్లో వృద్ధి 5 6 శాతానికి మందగించడంతో, ఉద్యోగులందరికీ పని ఉండటం లేదు.

**ఏఐ వల్ల:** ఏఐ వల్ల తక్కువ మందితోనే అధిక పని చేయగలుగుతున్నారు. కోడింగ్, సపోర్ట్ వంటి విభాగాల్లో దీనివల్ల 10 30% ఉత్పాదక లాభాలు కనిపిస్తున్నాయి. వినియోగదారుల సేవా రంగంలో 14 15%, కొన్ని రకాల కోడింగ్, రైటింగ్ వంటి పనుల్లో 40% మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. ఇంకా చాలా సంస్థలు ఏఐ వినియోగంలో ప్రాథమిక దశలోనే ఉన్నందున, దీనిద్వారా వచ్చే ఆదాయంపై స్పష్టమైన ఆధారాలు పరిమితంగానే ఉన్నాయి.

**ఉద్యోగ భద్రతపై ఆందోళన:** దిగ్గజ సంస్థల్లోనూ భారీ లేఆఫ్స్ కారణంగా, 60 శాతానికి పైగా టెక్ ఉద్యోగులు తమ వృత్తిజీవితంపై ఆందోళన చెందుతున్నారు. ఒరాకిల్, గూగుల్, మెటా వంటి సంస్థల్లో జరుగుతున్న 'నిర్దాక్షిణ్య తొలగింపులు' ఐటీ నిపుణుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్నాయి. 'ఉద్యోగులు సిస్టమ్‌లో లాగిన్ అవ్వకముందే, వారి ఐడీ కార్డులను డీయాక్టివేట్ చేస్తూ.. ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇమెయిల్ ద్వారా పంపుతున్న ఆటోమేటెడ్ తొలగింపు నోటీసులే ఇందుకు కారణం. సంప్రదాయ ఐటీ ఉద్యోగాలు వృద్ధి చెందకపోవడం, డిజిటల్ ఉద్యోగాలు పెరగడం వంటి పరిణామాల వల్ల మధ్య స్థాయి నిపుణులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. నైపుణ్యాలు పెంచుకునేందుకు తగిన మద్దతు ఇవ్వక పోవడం వల్ల, సామాజిక ప్రభావం అధికంగా ఉండనుంది.

**ఏఐపై భారీగా పెట్టుబడులు:** కంపెనీల కోణంలో చూస్తే.. ఈ తొలగింపులు కేవలం ఆర్థిక ఇబ్బందుల వల్లే కాదు. అధిక శ్రమతో కూడిన విధానాల నుంచి సాంకేతికత ఆధారిత వృద్ధి వైపు మళ్లడమే ప్రధాన కారణం. లేఆఫ్స్ ద్వారా ఆదా అయిన మొత్తాన్ని, పెద్ద సంస్థలు కృత్రిమ మేధ మౌలిక వసతులపై పెట్టుబడిగా పెడుతున్నాయి. ఒరాకిల్ ప్రపంచవ్యాప్తంగా 30,000 మంది (ఇందులో మనదేశంలో 12,000 మంది)ని తొలగించడమూ ఇందులో భాగమే.



ఫిన్‌టెక్ దిగ్గజం బ్లాక్ కూడా 40% (4,000 మంది) ఉద్యోగులను తొలగించినట్లు ఈ ఏడాది ప్రారంభంలో ప్రకటించింది.

**కొత్త నైపుణ్యాలకే గిరాకీ:** సాధారణ ఐటీ సేవల రంగంలో వార్షిక నియామక వృద్ధి 4 6% కాగా, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల(జీసీసీ)లో ఏఐ, డేటా, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో 18 27% వృద్ధి నమోదవుతోంది. నూతన విభాగాల్లో నైపుణ్యాల కొరత 2560 శాతంగా ఉంటోంది. అందుకే కంపెనీలు ఏఐ నిపుణులకు 1012% వేతన వృద్ధి ఇస్తున్నాయి. సీనియర్లకు రూ.60లక్షల వరకూ వార్షిక వేతనం అందించేందుకు సిద్ధం అవుతున్నాయి.

**నైపుణ్యాల పెంపు అవసరం:** ఏఐ కారణంగా దేశంలో లక్షల ఉద్యోగాల తీరు మారుతుంది. ఇందుకు తగ్గట్లు ప్రస్తుత ఉద్యోగులకు నైపుణ్యాలు పెంచేందుకు కంపెనీలు చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులు కూడా కొత్త నైపుణ్యాలు నేర్చుకునేందుకు ఆసక్తి చూపాలి. ప్రస్తుత క్లిష్ట సమయంలో ఉద్యోగులకు సరైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించాలి.

# యుద్ధ ప్రభావిత రంగాలకు మద్దతు ఇస్తాం

### మూలధన వ్యయాలు పెంచుతాం
### ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించొచ్చు
### ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

పశ్చిమాసియా సంక్షోభంతో, దేశీయంగా ప్రభావితమైన రంగాలకు మద్దతు ఇవ్వడానికి, మూలధన వ్యయాల్ని పెంచడానికి ప్రభుత్వానికి తగినంత ద్రవ్య పరమైన వెసులుబాటు ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం వెల్లడించారు. యుద్ధం వల్ల తలెత్తుతున్న పరిస్థితిని ఎదుర్కోవడానికి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వడ్డీ రేట్లు మరింత తగ్గించేందుకు వీలుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బతినకుండా మెరుగైన విధానాలు అనుసరించిన ఫలితం ఇప్పుడు కలిసొస్తోందని పేర్కొన్నారు. అధిక అప్పులు, భారీ ద్రవ్యలోటు కలిగిన అనేక దేశాలు ప్రస్తుత సంక్షోభ సమయంలో ఇబ్బంది పడుతున్నాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ) కార్యక్రమంలో మంత్రి వివరించారు. దశాబ్ద కాలంగా ద్రవ్య క్రమశిక్షణ పాటించినందునే.. ముడి చమురు ధర 50% పెరిగినా, మన దేశంలో డీజిల్, పెట్రోల్ రిటెయిల్ ధరలు పెంచలేదని, కీలక పెట్రో ఉత్పత్తులకు, దేశీయ టారిఫ్ ప్రాంతంలో పని చేసే ప్రత్యేక ఆర్థిక మండళ్ల (ఎస్ఈజెడ్)కు నిర్దిష్ట మినహాయింపులు ఇచ్చినట్లు వివరించారు. మార్చి 26న పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం తగ్గించడాన్నీ గుర్తు చేశారు. ఎగుమతులను నిరుత్సాహ పరచి, దేశీయంగా సరఫరాల్లో కొరత లేకుండా చూసేందుకు డీజిల్‌పై లీటరుకు రూ.21.50, విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై లీటరుకు రూ.29.50 చొప్పున ఎగుమతి సుంకాన్ని విధించామన్నారు.



## రూ.800 కోట్లతో అరబిందో షేర్ల బైబ్యాక్




ఔషధ తయారీ సంస్థ అరబిందో ఫార్మా, పెద్దఎత్తున షేర్ల బైబ్యాక్‌కు నిర్ణయించింది. రూ.800 కోట్లతో సంస్థకు చెందిన ఈక్విటీ షేర్లను తిరిగి కొనుగోలు చేసే ప్రతిపాదనకు సంస్థ డైరెక్టర్ల బోర్డు సోమవారం ఆమోదం తెలిపింది. బైబ్యాక్ ఆఫర్ కింద రూ.1 ముఖ విలువ కలిగిన మొత్తం 54.23 లక్షల షేర్లను కంపెనీ కొనుగోలు చేయనుంది. ఒక్కో షేరు కొనుగోలు ధరను రూ.1,475గా నిర్ణయించారు. ఇది కంపెనీ మొత్తం ఈక్విటీ షేర్ల మూలధనంలో 0.93 శాతానికి సమానం. బైబ్యాక్ కోసం రికార్డు తేదీగా ఏప్రిల్ 17ను నిర్ణయించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సంస్థ సమాచారం ఇచ్చింది. ప్రస్తుతం షేరు ధర రూ.1,340 వద్ద ఉంది. అరబిందో ఫార్మా, షేర్ల బైబ్యాక్ చేయడం రెండేళ్ల వ్యవధిలో ఇది రెండోసారి. 2024 ఆగస్టులో షేరుకు రూ.1,460 ధర వద్ద, మొత్తం రూ.750 కోట్లతో బైబ్యాక్ ఆఫర్ ప్రకటించింది.బీపీ11 మూడోదశ ప్రయోగం: అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ క్యూరాటెక్ బయోలాజిక్స్ చేపట్టిన బీపీ 11 మూడో దశ క్లినికల్ పరీక్షలు విజయవంతమైనట్లు సంస్థ ప్రకటించింది. ప్రముఖ ఔషధం జొలైర్‌కు బయోసిమిలర్‌గా దీనిని అభివృద్ధి చేస్తోంది. అకస్మాత్తుగా వచ్చే దద్దుర్లు, దురదలతో బాధపడుతున్న 608 మందిపై 7 ఐరోపా దేశాలతో పాటు, భారత్‌లోని 80 కేంద్రాల్లో ఈ ఔషధ ప్రయోగాలు చేసినట్లు సంస్థ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నాటికి, ఈ ఔషధ అనుమతుల కోసం ఎఫ్‌డీఏ, ఈఎంఏలకు దరఖాస్తు చేయనున్నట్లు క్యూరాటెక్ తెలిపింది.

## సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదార్లకు రూ.1,500 కోట్ల నష్టం

పశ్చిమాసియా ఉద్రిక్తతల పరిణామాల వల్ల, మన దేశంలోని సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదార్లకు రూ.1,500 కోట్ల నష్టం వాటిల్లొచ్చని అంచనా వేస్తున్నారు. హార్మూజ్ జలసంధి, ఎర్ర సముద్రంలో సరకు రవాణా నౌకలకు అవరోధాలు ఎదురవుతుండటం ఇందుకు నేపథ్యం. 2025లో 13.1 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1,25,000 కోట్లు)గా ఉన్న భారత సముద్ర ఉత్పత్తుల రంగ విపణిపై ఇప్పటికే యుద్ధ ప్రభావం కనిపిస్తోందని సంబంధిత నిపుణులు చెబుతున్నారు. మనదేశం నుంచి సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో అధిక భాగం ఐరోపా, రష్యా, అమెరికా తూర్పు తీర ప్రాంతాలకు వెళ్తుంటాయి. ఈ ఉత్పత్తుల రవాణా అధికంగా ఎర్ర సముద్రం మీదుగా జరుగుతుంటుంది. హార్మూజ్ జలసంధి మీదుగా 34 శాతమే వెళ్తుంటాయి. మన సముద్ర ఉత్పత్తుల ఎగుమతులకు పశ్చిమాసియా ప్రాంతం అంత కీలకం కానప్పటికీ.. ఈ ప్రాంతంతో ప్రత్యక్ష సంబంధాలున్న ఎగుమతిదార్లకు సవాళ్లు ఎదురవుతున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రత్యక్షంగా ఒక త్రైమాసికానికి రూ.500 కోట్ల నష్టం వాటిల్లొచ్చని దేశీయ సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదార్ల సంఘం (ఎస్ఈఏఐ) ప్రధాన కార్యదర్శి కె.ఎన్.రాఘవన్ అంచనా వేశారు. రవాణా ఆలస్యం వల్ల పెరగనున్న వ్యయాలు, బీమా ఖర్చులు తదితరాల రూపేణా పరోక్షంగా మరో రూ.600 700 కోట్ల మేర ఎగుమతిదార్లపై భారం పడొచ్చని తెలిపారు. ఉద్రిక్తతలు మరో 23 నెలలు కొనసాగితే, ఈ మొత్తం నష్టం సుమారు రూ.1,500 కోట్లకు పెరిగే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. ప్రస్తుత అవరోధాలు లేకపోతే, ఈ ఏడాది సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు 1015% పెరిగేవని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టరు రాహుల్ గుహా తెలిపారు.



# సినీ పరిశ్రమకు త్రిష గుడ్‌బై చెప్పనున్నారా?


## ... నటుడి వ్యాఖ్యలు వైరల్



స్టార్ హీరోయిన్ త్రిష సినీ కెరీర్‌ను ఉద్దేశించి సీనియర్ నటుడు, దర్శకుడు చిత్రా లక్ష్మణన్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్రిష త్వరలోనే సినిమాలకు గుడ్‌బై చెప్పనున్నారని తెలిపారు. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు ఆయన విధంగా బదులిచ్చారు. ''త్రిష సినిమాలకు గుడ్ బై చెప్పనున్నారంటూ గత కొన్నిరోజులుగా వార్తలు వస్తున్నాయి. ఈ విషయమై తెలిసిన నిర్మాతలను సంప్రదించా. ఇకపై సినిమాల్లో కొనసాగాలని ఆమె అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదని చెప్పారు'' అని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. పూర్తి సమాచారం ఉంటేనే చిత్ర లక్ష్మణన్ కామెంట్స్ చేస్తారని.. కాబట్టి, ఇది నిజమయ్యే ఉంటుందేమోనని ఆమె అభిమానులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన ఈ వార్తలపై త్రిష నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

# 'కోర్ట్' రీమేక్..

## నటి దేవయాని వారసురాలి ఎంట్రీ






పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించేలా దర్శకుడు రామ్ జగదీశ్ తెరకెక్కించిన 'కోర్ట్' సినిమా మంచి విజయం అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ లీగల్ డ్రామా మూవీ.. కోలీవుడ్‌లో రీమేక్ అవుతోంది. చెన్నైలో సోమవారం ఈ చిత్ర ప్రారంభోత్సవం సందడిగా జరిగింది. ఈ వేడుకకు నటుడు విశాల్, దర్శకుడు వెట్రిమారన్ తదితరులు ముఖ్య అతిథిగా హాజరై, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'రంజన్: ది అడ్వకేట్' టైటిల్‌తో త్యాగరాజన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. జీన్స్ ప్రశాంత్.. టైటిల్ పాత్రను పోషిస్తున్నారు. ఆయన తండ్రే ఈ మూవీ డైరెక్టర్. నటి దేవయాని కుమార్తె ప్రియాంకా రాజకుమారన్, నిర్మాత ఎస్. కథిరేశన్ తనయుడు హరి ఈ సినిమాతోనే కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తుండటం విశేషం. తెలుగులో హర్ష్ రోషన్ పోషించిన పాత్రలో హరి నటించనున్నాడు. శ్రీదేవి రోల్‌లో ప్రియాంక సందడి చేయనుంది. మరో కీలక పాత్ర మంగపతిగా కోలీవుడ్‌లో ఎవరు కనిపిస్తారా? అన్నది ఆసక్తికరం. దేవయాని మరెవరో కాదు హిట్‌మూవీ 'సుస్వాగతం' హీరోయిన్. 'చెన్నకేశవరెడ్డి', 'అరవింద సమేత' తదితర చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు.

# రణబాలి బలం... జయమ్మ



అతని జీవితంలోని ఏకైక రంగు... హంగు ఆమె. అతని బలం, సంతోషం ఆమె. యోధుడైన రణబాలి జీవితాన్ని పంచుకున్న ఆమె పేరే... జయమ్మ. బ్రిటిష్ పాలన కాలంలోని ఈ జంట ప్రేమ ప్రయాణం ఎలా సాగిందో తెలియాలంటే 'రణబాలి' చూడాల్సిందే. ఇటీవలే నిజ జీవితంలో ఏడడుగులు వేసి ఒక్కటైన విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటిస్తున్న చిత్రమిది. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవలే అనంతపురంలో కీలక సన్నివేశాల్ని తెరకెక్కించారు. ఆదివారం రష్మిక పుట్టినరోజును పురస్కరించుకుని చిత్రబృందం ప్రత్యేకమైన వీడియోను విడుదల చేసింది. సహజత్వం ఉట్టిపడే జయమ్మ పాత్రకి తగ్గట్టుగా రష్మిక మారిన విధానం ఈ వీడియోలో కనిపిస్తుంది. 1854 నుంచి 1878 మధ్యకాలంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా, పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న చిత్రమిది. సెప్టెంబరు 11న రానుంది.

**--'మైసా' రణం.....** రష్మిక ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతున్న మరో చిత్రం 'మైసా'. రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్నారు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో రష్మిక గోండు మహిళగా కనిపించనుంది. ఆమె పుట్టినరోజుని పురస్కరించుకుని ఆదివారం ఈ సినిమాలోని పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. రణభూమిలో ఉన్న మహిళగా రష్మిక అందులో దర్శనమిచ్చింది. గోండు తెగల సాంస్కృతిక నేపథ్యంతో ముడిపడిన కథ ఇదని, పాన్ ఇండియా స్థాయిలో భారీ హంగులతో రూపొందిస్తున్నామని సినీవర్గాలు చెప్పాయి. ఈశ్వరీరావు, గురు సోమసుందరం, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# 'ఉస్తాద్ భగత్‌సింగ్'.. కాలరే ఎత్తరా ఫుల్ వీడియో విడుదల


'ఉస్తాద్ భగత్‌సింగ్' లోని 'ఎత్తరా ఎత్తరా కాలరే ఎత్తరా' సాంగ్‌లో పవన్ కల్యాణ్ తన డ్యాన్స్‌తో అభిమానులను అలరించిన సంగతి తెలిసిందే. ఈ సాంగ్ ఫుల్ వీడియో సోమవారం విడుదలైంది. పవన్‌తో కలిసి హీరోయిన్ రాశీఖన్నా ఈ పాటకు స్టెప్పులేశారు. పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ తెరకెక్కించిన ఈ సినిమా మార్చిలో బాక్సాఫీసు ముందుకొచ్చిన సంగతి తెలిసిందే.



# 'ధురంధర్ 2'పై బాలీవుడ్ అసూయ

## జాకీర్ ఖాన్ సెటైర్లు

ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడమే కాకుండా కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నుంచి ఈ సినిమాకు వస్తోన్న ప్రశంసలపై కమెడియన్ జాకీర్‌ఖాన్ సెటైర్లు వేశారు. స్క్రీన్ అవార్డ్స్ 2026 వేడుకకు వ్యాఖ్యాతగా వ్యవహరించిన జాకీర్.. ఈ విజయంపై బాలీవుడ్ నిజమైన ప్రేమ చూపడం లేదన్నారు. "ఎన్ని అభినందనల పోస్ట్‌లు పెట్టినా, ఎన్ని ఇన్‌స్టా స్టోరీల్లో దీనిపై ప్రశంసలు కురిపించినా, ఇంటర్వ్యూల్లో ఇది నాకు ఎంతో ఇష్టమైన చిత్రమని చెప్పినా.. అవి వాస్తవాలు కావు. నిజం చెప్పాలంటే 'ధురంధర్ 2'ను చూసి అందరికీ లోలోపల అసూయగా ఉంది" అని జాకీర్ అన్నారు. బయటకు మాత్రం సినిమాను ప్రశంసిస్తున్నప్పటికీ ఇంత పెద్ద సక్సెస్‌ను చూసి బాలీవుడ్ వర్గాలు ఓర్వలేకపోతున్నాయని జాకీర్ చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'ధురంధర్ 2' సక్సెస్.. వాళ్లకు థాంక్స్ చెబుతూ సారా అర్జున్ పోస్ట్ విడుదలైన నాటినుంచే భారీ వసూళ్లు సొంతం చేసుకుంటూ రికార్డులను ఖాతాలో వేసుకుంటోంది 'ధురంధర్ 2' చిత్రం. తాజాగా మరో ఘనతను సాధించింది. విడుదలైన 18వ రోజు కూడా రూ.28 కోట్లు వచ్చినట్లు బాలీవుడ్ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటివరకూ రూ.1600 కోట్లు కొల్లగొట్టిన ఈ చిత్రం కేవలం ఇండియాలోనే రూ.1,013 కోట్లు సాధించింది. అత్యంత వేగంగా భారత్‌లో రూ.1000 కోట్లు సొంతం చేసుకున్న మూడో సినిమాగా నిలిచింది. ఈ



జాబితాలో ఉన్న 'బాహుబలి 2', 'పుష్ప 2'ల సరసన 'ధురంధర్ 2' కూడా చేరింది.


# అప్లికేషన్ పరిచయం చేసే ప్రేమను నమ్మగలమా!

''మనం 2040లో టెక్నాలజీపైన ఎంతగా ఆధారపడిపోతామో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రంలో చాలా వినూత్నంగా చూపించార''న్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఈ చిత్ర ట్రైలర్‌లో చూపించింది తక్కువేనని.. థియేటర్స్‌లో సినిమా మామూలుగా ఉండదని తెలిపారు. ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి జంటగా నటించిన ఈ చిత్రాన్ని విఘ్నేశ్ శివన్ తెరకెక్కించారు. నయనతార, ఎస్ఎస్ లలిత్ కుమార్ నిర్మించారు. ఎస్‌జే సూర్య, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 10న రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత దిల్‌రాజు అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా దర్శకుడు అనిల్ మాట్లాడుతూ.. ''విఘ్నేశ్ నాకు ఈ చిత్ర తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ని చూపించారు. నేను చాలా ఎంజాయ్ చేశా. ఇది న్యూఏజ్ కంటెంట్‌తో ఉంది. ప్రదీప్ నటన చాలా సహజంగా ఉంటుంది. ఇది కచ్చితంగా తన కెరీర్‌లో మరో పెద్ద హిట్టవుతుంది'' అన్నారు. తాను తదుపరి వెంకటేశ్ కల్యాణ్‌రామ్‌లతో చేయనున్న సినిమాలో కృతిశెట్టి కథానాయికగా



నటించనున్నట్లు ఈ వేదికపై పేర్కొన్నారు. ''ఈరోజుల్లో ప్రేమకథలు తీయడం కష్టం. అలాంటిది అందరికీ కనెక్ట్ అయ్యేలా.. ఒక అప్లికేషన్ నేపథ్యంలో ఈ సినిమా రూపొందించారు. ఈ కాన్సెప్ట్ చాలా కొత్తగా ఉంది. ప్రేక్షకులు దీన్ని విజయవంతం చేయాలని కోరుతున్నా'' అన్నారు నిర్మాత దిల్‌రాజు. హీరో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ.. ''ప్రస్తుతం మనం రిలేషన్‌షిప్స్, ఆరోగ్యం, ఎమోషన్స్.. ప్రతి దానికీ ఫోన్‌పైనే ఆధారపడుతున్నాం. మరి ఇప్పుడే ఇలా ఉంటే.. 2040లో జీవితాలు ఎలా ఉంటాయి. మనుషుల కంటే యాప్స్‌పైనే నమ్మకం పెరుగుతుంది. ఆఖరికి ఎవరిని పెళ్లి చేసుకోవాలో కూడా అదే చెప్తుంది. మరి 2040లో ఓ యువకుడికి అలాంటి పరిస్థితే ఎదురైతే.. ఆ అప్లికేషన్ పరిచయం చేసే ప్రేమను నమ్మగలమా? అనేదే ఈ చిత్ర కథాంశం. దీంట్లో ప్రేమ, కామెడీ, పాటలు అన్నీ ఉంటాయి'' అన్నారు. ''ఇదొక ప్రయోగాత్మక చిత్రం. భవిష్యత్తులో సాగే కథగా ఉంటుంది. అందరికీ కనెక్ట్ అయ్యేలాగే ఉంటుంది'' అన్నారు దర్శకుడు విఘ్నేశ్. కృతి శెట్టి, ఎస్‌జే సూర్య, శివప్రసాద్ పాల్గొన్నారు.

# 'బ్యాడ్‌బాయ్ కార్తీక్'గా నాగశౌర్య..



నాగశౌర్య తన రూటు మార్చి, చేసిన లేటెస్ట్ యాక్షన్ మూవీ 'బ్యాడ్‌బాయ్ కార్తీక్'. ఈ కార్తీక్ కథేంటి? బ్యాడ్‌బాయ్‌గా ఎందుకు మారాడు? అన్నది కొన్ని రోజుల్లోనే తెలియనుంది. ఈనెల 17న మూవీ రిలీజ్ కానుంది. రమేశ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో విది కథానాయిక. సాయి కుమార్, సముద్రఖని తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇంకెందుకు ఆలస్యం ట్రైలర్ చూసేయండి.

# ఒక నటిగా నా ఎజెండా అదే:మృణాల్ ఠాకూర్

''ఎప్పటికప్పుడు కొత్త ప్రయత్నాలు చేయకపోతే... కొత్త విషయాలు ఎలా తెలుస్తాయి? నా నట ప్రయాణంలోనూ కొత్త అడుగులు వేస్తుండడానికి కారణమదే'' అంటోంది మృణాల్ ఠాకూర్. 'సీతారామం', 'హాయ్ నాన్న' తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్ని గెలుచుకుందీమె. మరాఠీ అమ్మాయినైన తనని అంతా ఓ తెలుగమ్మాయిలాగే చూస్తున్నారు. ఆ గుర్తింపు ఎంతో తృప్తినిస్తోందని చెబుతోంది. ఇటీవల ఆమె అడివి శేష్‌తో కలిసి 'డెకాయిట్' చిత్రంలో నటించింది. ఆ చిత్రం ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా మృణాల్ ఆదివారం విలేకర్లతో ముచ్చటించారు. ''సరికొత్త నేపథ్యంలో సాగే కథలు, కొత్త సవాళ్లనిచ్చే పాత్రలు, అంతకుముందు చేయని కొత్త ప్రయత్నాలు... ఇవే నన్ను నటిగా ఎక్కువగా ఆకర్షిస్తుంటాయి. 'డెకాయిట్' చేయడానికీ కారణం ఆ అంశమే. నేను ఈ జానర్ కథల్లో ఇదివరకెప్పుడూ చేయలేదు. యాక్షన్ ప్రధానంగా సాగే ఓ ప్రేమకథ ఇది. నేను సరస్వతి అనే యువతిగా కనిపిస్తా. హరి పాత్రలో శేష్ కనిపిస్తాడు. ఈ రోమియో, జూలియట్... డెకాయిట్స్‌గా ఎందుకు మారాల్సి వచ్చిందనేది ఈ సినిమాలో కీలకం. ప్రేక్షకులు ఆశ్చర్యపోయేలా చేయడం నాకు ఇష్టం. అలాంటిది ఇందులో నాకు నేనే ఆశ్చర్యపోయే పాత్రని పోషించే అవకాశం వచ్చింది. కచ్చితంగా ఈ సినిమా, ఇందులోని మా పాత్రలు అందరికీ నచ్చుతాయి''. ''యాక్షన్, ప్రేమ... ఈ మేళవింపే ఎంతో ప్రత్యేకం. సినిమాలోని ఆ రెండు కోణాలు ఎంతో ప్రభావం చూపిస్తాయి. నేను కొన్ని యాక్షన్ సన్నివేశాల్లో నటించా. అలాగని నేను హీరోల్లాగా వీరోచితమైన ఫైట్స్ అంటూ ఏమీ చేయను. కార్ ఛేజింగ్ సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయి. డ్రైవింగ్ అంటే నాకు చాలా ఇష్టం. మా ఇంట్లో కార్ నడిపిన తొలి అమ్మాయిని నేనే. కార్ నడుపుతూ ఇందులో చాలా సన్నివేశాల్లో కనిపిస్తా. నటిస్తున్నప్పుడు సెట్‌లో ఎన్ని సవాళ్లు ఎదురయ్యాయో, అంత సంతృప్తినిచ్చిన సినిమా ఇది. అడివి శేష్ కథానాయకుడిగా అత్యుత్తమ దశలో ఉన్నాడు. తను ఇందులో మరింత అద్భుతం అనిపిస్తాడు. తను కూడా ఇప్పటివరకూ చేయని కొత్త పాత్రని ఇందులో చేశాడు. శేష్, ప్రకాశ్‌రాజ్, అనురాగ్ కశ్యప్ తదితర అనుభవం, ప్రతిభ ఉన్న నటులతో కలిసి తెరను పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. దర్శకుడు షానియోల్, శేష్‌తోపాటు ఇతర బృందమంతా కలిసి మంచి సమన్వయంతో ఈ చిత్రం చేసింది. సుప్రియ లాంటి నిర్మాతని నేను ఇదివరకెప్పుడూ చూడలేదు. సెట్‌లో ఏ విషయంలోనూ రాజీపడరు. నటీనటుల విషయంలో ఆమె తీసుకొనే జాగ్రత్తలు బాగుంటాయి''. ''ప్రేమకథలు నాకు కొత్త కాదు. అందులో ఈ సినిమా భిన్నం. 'సీతారామం'లో పోషించిన సీత తరహా పాత్రలో నన్ను చూడాలని చాలా మందికి ఉంటుంది. దానికి భిన్నమైన ఓ కొత్త పాత్రలో చూడాలనుకునేవాళ్లూ చాలా మందే. అలాంటివాళ్ల కోసమే ఈ సినిమా. హిందీ, తెలుగు భాషల్లో చిత్రీకరణ చేశాం. దాంతో ప్రతీ సన్నివేశాన్ని రెండు సార్లు చేస్తున్నప్పుడు ఓ రివిజన్‌లా అనిపించేది. ఈ ప్రయాణాన్ని చాలా ఆస్వాదించా. భాషల మధ్య హద్దులు చెరిపేయాలన్నదే నటిగా నా ఎజెండా. ఈమధ్య ఓ వేడుకలోనూ ఇదే విషయాన్ని చెప్పా. 'మాకు దక్షిణాది సినిమాల్నీ బాగా పరిచయం చేశావు' అంటూ ఒకరు నన్ను హత్తుకుని మెచ్చుకున్నారు. నా సినిమాని ఏ భాషలో చూసినా ప్రేక్షకులు ఆ భావోద్వేగాల్ని ఆస్వాదించాలన్నదే నా తపన. అది దృష్టిలో పెట్టుకునే కథల్ని ఎంపిక చేసుకుంటున్నా. మరాఠీ అమ్మాయినైన నేను నా ప్రాంతం, భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకులకు చేరువయ్యాననే విషయం గుర్తొచ్చినప్పుడల్లా ఎంతో గర్వంగా ఉంటుంది''. ''తెలుగు, హిందీ, మరాఠీ... ఇలా విభిన్నమైన భాషల్లో నటించడాన్ని ఆస్వాదిస్తున్నా. ప్రతీ భాషలోనూ ఓ కొత్త రకమైన కథని, ఓ కొత్త భావోద్వేగాన్నీ చెప్పే అవకాశం లభిస్తోంది. సినిమా ఎంపికలో నాకు కలయికల కంటే కూడా కథల్నే ప్రామాణికంగా తీసుకుంటుంటా. 'గీతగోవిందం' తర్వాత విజయ్ దేవరకొండ, పరశురామ్ కలిసి చేస్తున్న సినిమా కావడంతో, కథతోపాటు ఆ కలయికనీ దృష్టిలో ఉంచుకుని 'ఫ్యామిలీ స్టార్' చేశా. కొన్నిసార్లు ఫలితాలు రావొచ్చు, కొన్నిసార్లు రాకపోవచ్చు. కానీ మనసు చెప్పింది చేయాలన్నదే నా నియమం. అలా చేసినప్పుడే తృప్తి''.





## ఈ ఓటమికి నేనే బాధ్యుడిని: రుతురాజ్ గైక్వాడ్

ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు వరుసగా మూడో ఓటమి. మరోసారి టాప్ ఆర్డర్ విఫలమైనప్పటికీ.. మిగతా బ్యాటర్లు పోరాడటం సానుకూలాంశమే. అయితే, హ్యాట్రిక్ ఓటమికి తానే బాధ్యుడినని కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ వ్యాఖ్యానించాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్దేశించిన 251 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో చెన్నై 207 పరుగులకే ఆలౌటైంది. భారీ అంచనాలు పెట్టుకున్న సంజు శాంసన్ (9) మరోసారి సింగిల్ డిజిట్‌కే పరిమితమై నిరాశపరిచాడు. ''నేను ఎక్కువగా కంట్రిబ్యూట్ చేసి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదేమో. అందుకే, ఈ ఓటమికి నాదే బాధ్యత. బౌలింగ్ చేసే సమయంలో 14వ ఓవర్ వరకూ మ్యాచ్ మా చేతుల్లోనే ఉంది. ఆ తర్వాత మ్యాచ్ స్వరూపం మారిపోయింది. మా నుంచి జారిపోవడం ప్రారంభమైంది. టిమ్ డేవిడ్‌ను అన్షుల్ కాంబోజ్ క్లీన్‌బౌల్డ్ చేసినా.. అది నోబాల్ అయిపోయింది. అక్కడినుంచి డేవిడ్ దూకుడుగా ఆడాడు. అతడు ఔటై ఉంటే కూడా ఆర్సీబీ ఇంత భారీ స్కోరు చేసుండేది కాదు. లక్ష్య ఛేదనలో మాకు శుభారంభం దక్కలేదు. సర్ఫరాజ్ ఖాన్, ప్రశాంత్ వీర్, ఓవర్టన్ మంచి ఆటతీరు ప్రదర్శించారు. శివమ్ దూబె దురదృష్టవశాత్తూ పెవిలియన్‌కు చేరాడు '' అని రుతురాజ్ వెల్లడించాడు. రుతురాజ్ గైక్వాడ్ 3 బంతుల్లో ఏడు పరుగులు చేశాడు. అందులో ఒక సిక్స్ కూడా ఉంది.

## వర్షం వల్ల మ్యాచ్ రద్దు..
# కోల్‌కతా, పంజాబ్ జట్లకు చెరో పాయింట్

ఐపీఎల్ (IPL) 2026లో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ (KKR vs PBKS) మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. టాస్ గెలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. 3.4 ఓవర్ల వద్ద వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించింది. దీంతో ఆటగాళ్లు మైదానాన్ని వీడారు. ఆ సమయానికి కోల్‌కతా జట్టు 2 వికెట్ల నష్టానికి 25 పరుగులు చేసింది. క్రీజులో అజింక్య రహానే (8), అంగ్క్రిష్ రఘువంశీ (7) నాటౌట్‌గా ఉన్నారు. జేవియర్ బార్ట్‌లెట్ తన తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ఫిన్ అలెన్ (6), కామెరూన్ గ్రీన్ (4)ను పెవిలియన్‌కు పంపాడు. 12 పరుగుల వద్ద తొలి వికెట్‌ను కోల్పోయిన కోల్‌కతా, 16 రన్స్ వద్ద రెండో వికెట్‌ను కోల్పోయింది.అయితే మొదట చిన్నగా ప్రారంభమైన వర్షం.. తర్వాత జోరందుకుంది. బలమైన గాలులు సైతం వీచాయి. ఎట్టకేలకు వర్షం ఆగినా.. ఔట్‌ఫీల్డ్ తడిగా ఉండటంతో అయిదు ఓవర్ల ఆట కూడా సాధ్యం కాదని తేల్చారు. అనంతరం అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరు జట్లకూ చెరో పాయింట్ కేటాయించారు. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ ఖాతాలో అయిదు పాయింట్లు, కోల్‌కతా నైట్ రైడర్స్ ఖాతాలో ఒక పాయింట్ ఉన్నాయి.



## అలా చేయడం సరికాదు..
# యువీకే తప్పలేదంటే...



టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్లలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు యువరాజ్ సింగ్. భారత జట్టు 2007లో టీ20 ప్రపంచకప్, 2011లో వన్డే వరల్‌డ్‌కప్ గెలవడంతో ఈ మాజీ ఆల్‌రౌండర్‌ది కీలక పాత్ర. ఈ మెగా టోర్నీ తర్వాత క్యాన్సర్‌ఉందని తేలగా.. మొక్కవోని విశ్వాసంతో మహమ్మారి జయించి తిరిగి మైదానంలో అడుగుపెట్టిన ఘనుడు యువీ. అయితే, కెరీర్ చరమాంకంలో యువీకి గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. జట్టులో చోటు ఉంటుందో లేదో తెలియని పరిస్థితి. ఈ క్రమంలో 2019 వన్డే వరల్‌డ్‌కప్‌లో ఆడాలన్న కోరిక తీరకుండానే యువీ రిటైర్మెంట్ ప్రకటించాల్సి వచ్చింది.

**కనీస సమాచారం కూడా ఇవ్వకుండా..**

ఈ విషయం గురించి యువరాజ్ సింగ్ తాజాగా స్పోర్ట్స్ తక్ ఇంటర్వ్యూలో స్పందించాడు. నాటి కెప్టెన్ విరాట్ కోహ్లి, హెడ్‌కోచ్ రవిశాస్త్రి తన పేరును పరిగణనలోకి తీసుకోలేదని.. అందుకు సంబంధించి కనీస సమాచారం కూడా ఇవ్వలేదని వాపోయాడు. ఫిట్‌నెస్ పరీక్ష పాసైనా ఎదురుచూపులు తప్పలేదని.. అందుకే రిటైర్మెంట్ ఇచ్చానని తెలిపాడు.

**అంతటి యువీకే తప్పలేదంటే**

ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ వసీం జాఫర్ యువీ వ్యాఖ్యలపై స్పందించాడు. యువరాజ్ పట్ల యాజమాన్యం వైఖరి తనను నిరాశపరిచిందని పేర్కొన్నాడు. ఈ మేరకు.. ''మొదట్లో వార్తా పత్రికల్లో చూసి ఆటగాళ్లు తమ కెరీర్ కొనసాగుతుందా? ముగిసిపోయిందా? అని తెలుసుకునేవాళ్లు. అయితే, యాజమాన్యం మరీ ఇంత ఘోరంగా ఉండాల్సింది కాదు. టీమిండియాకు రెండు వరల్‌డ్‌కప్‌లు అందించిన యువరాజ్ సింగ్ వంటి దిగ్గజాల విషయంలోనైనా కాస్త మెరుగ్గా ప్రవర్తించాల్సింది. తనను ఎవరూ సంప్రదించకుండానే రిటైర్మెంట్ తీసుకునేలా చేశారని యువీ అన్నాడు. ఇలా చేయడం సరికాదు. కచ్చితంగా ఆటగాళ్లతో చర్చించి వారికి మేనేజ్‌మెంట్ స్పష్టతనివ్వాలి'' అని వసీం జాఫర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నాడు.

**రోకోలకు చెప్పండి**

కాగా యువీ ఇటీవల మాట్లాడుతూ.. మేనేజ్‌మెంట్ తన విషయంలో వ్యవహరించినట్లు మరెవరి విషయంలో వ్యవహరించకూడదని అన్నాడు. ప్రస్తుతం వన్డే ఫార్మాట్లో మాత్రమే కొనసాగుతూ.. వరల్‌డ్‌కప్2026 రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలకు కూడా మేనేజ్‌మెంట్ సరైన సమాచారం ఇవ్వాలని యువీ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డాడు. వాళ్లిద్దరు గొప్ప ఆటగాళ్లని.. వారిని సాదరంగా పంపితే బాగుంటుందని పేర్కొన్నాడు.

## ధోనికి ఫిట్‌నెస్ టెస్టు..
# ఆ మ్యాచ్‌కు రెడీ అయినట్టేనా?

ధోని రాక కోసం చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు ఫ్యాన్స్‌కు షాక్ ఇస్తూ.. రెండు వారాలు ఆటకు దూరమని సీఎస్‌కే మేనేజ్‌మెంట్ ప్రకటించింది. తమ అభిమాన క్రికెటర్‌ను మైదానంలో చూద్దామనుకున్న అభిమానులకు నిరాశ ఎదురైంది. మరోవైపు వరుసగా మూడు మ్యాచుల్లోనూ చెన్నై ఓడిపోవడంతో ధోని త్వరగా జట్టులో చేరాలని అభిమానులు కోరుతున్నారు. ధోని ప్రాక్టీస్ చేసిన వీడియోలూ నెట్టింట వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ధోనికి రాబోయే రెండు రోజుల్లో ఫిట్‌నెస్ టెస్టు జరగబోతోందని సీఎస్‌కే క్రికెట్ వర్గాలు తెలిపాయి. అది పూర్తి చేసుకుని ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగుతాడని తెలుస్తోంది. వచ్చే శనివారం ఢిల్లీతో సీఎస్‌కే తలపడనుంది.

**బ్రెవిస్ రాకపై ఫ్లెమింగ్ స్పష్టత**

ధోని మాత్రమే కాకుండా మరో హిట్టర్ డేవాల్డ్ బ్రెవిస్ సేవలను కూడా సీఎస్‌కే కోల్పోయింది. అయితే, బ్రెవిస్ కూడా ఢిల్లీతో మ్యాచ్‌లో ఆడే అవకాశాలు ఉన్నాయని చెన్నై ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వెల్లడించాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓటమి అనంతరం అతడు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. "బ్రెవిస్ తదుపరి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని ఆశిస్తున్నా. మాకు ఇంకా ఐదు రోజుల సమయం ఉంది. మేం అనుకున్న విధంగానే మా ప్రణాళికలను అమలు చేస్తాం" అని ఫ్లెమింగ్ వెల్లడించాడు.




## ఆసియా బాక్సింగ్‌లో కాంస్యం సాధించిన నిఖత్ జరీన్

మంగోలియాలో జరుగుతున్న ఏసియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ బాక్సర్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ కాంస్య పతకంతో సరిపెట్టింది. బంగారు పతక అంచనాలతో బరిలోకి దిగిన ఆమె ఫైనల్ చేరుకోలేకపోయింది. 51 కేజీల కేటగిరీలో పోటీపడిన నిఖత్ సెమీస్‌లో పరాజయం పాలైంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో పారిస్ ఒలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ వు యు(చైనా) చేతిలో 50 తేడాతో ఓడిపోయింది. 75 కేజీల కేటగిరీలో టోక్యో ఒలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్ లవ్లీనా బోర్గోహైన్ కూడా కాంస్యంతోనే సరిపెట్టింది. సెమీస్‌లో ఉజ్బెకిస్తాన్ బాక్సర్ అజిజా జోకిరోవా చేతిలో 50 తేడాతో పరాజయం పాలైంది. అంకుషిత బోరో(65 కేజీలు), పూజ రాణి(80 కేజీలు)లు కూడా సెమీస్‌లో ఓడి బ్రాంజ్ మెడల్‌తోనే ఇంటిదారిపట్టారు.

**స్వర్ణ పతక పోరుకు ముగ్గురు**

ప్రీతి పవర్, ప్రియా, అరుంధతి చౌదరి మాత్రం సత్తాచాటారు. తమ విభాగాల్లో ఫైనల్‌కు చేరుకుని గోల్డ్ మెడల్‌పై కన్నేశారు. 54 కేజీల కేటగిరీలో ప్రీతి సెమీస్‌లో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత ఏజీ ఇమ్‌ను 50తో మట్టికరిపించింది. 60 కేజీల కేటగిరీలో ప్రియా 50తోనే మంగోలియాకు చెందిన నమూన్ మోంఖోర్‌పై ఏకపక్ష విజయం సాధించింది. ఇక 70 కేజీల కేటగిరీలో అరుంధతి 41 తేడాతో ఉజ్బెకిస్తాన్ బాక్సర్ ఓఝా టోయిరోవాను చిత్తు చేసింది. టైటిల్ పోరులో ప్రీతి మూడు సార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన హువాంగ్ సియావో వెన్(చైనీస్ తైపీ)ని ఎదుర్కోనుంది. నార్త్ కొరియాకు చెందిన ఉన్ గ్యోంగ్ వోన్‌తో ప్రియాతో, బకిత్ సెయిడిష్(కజకస్థాన్‌తో అరుంధతి తలపడనున్నారు.





## ముంబై ఇండియన్స్‌కు గుడ్ న్యూస్

ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ తమ రెండో మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. మంగళవారం(ఏప్రిల్ 7) గువహటి వేదికగా రాజస్తాన్ రాయల్స్‌లో ముంబై ఇండియన్స్ తలపడనుంది. ఈ కీలక పోరుకు ముందు ముంబై అభిమానులకు ఒక గుడ్ న్యూస్ అందింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌కు అనారోగ్యం కారణంగా దూరమైన ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తిరిగి కోలుకున్నాడు.దీంతో రాజస్తాన్‌తో మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉండనున్నాడు. ఈ విషయాన్ని ముంబై బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే ధ్రువీకరించారు. "హార్దిక్ పాండ్యాకు ఎటువంటి గాయం కాలేదు. కేవలం అనారోగ్యం కారణంగానే గత మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఇప్పుడు అతను పూర్తి ఫిట్‌గా ఉన్నాడు. మంగళవారం రాజస్తాన్‌తో జరిగే మ్యాచ్‌లో పాండ్యా తప్పకుండా ఆడతాడు కాగా శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ముంబై ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఆశించినంత మేర రాణించలేకపోయింది. పాండ్యా రీఎంట్రీ ఇస్తే దీపక్ చహర్ బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశముంది.



## ఇష్టం లేకపోతే తప్పుకో.. సీఎస్‌కే ఫ్యాన్స్ ఆగ్రహం

టీమిండియా టీ20 ప్రపంచకప్ గెలవడంలో ఓపెనర్ సంజూ శాంసన్‌ది కీలకపాత్ర అని చెప్పొచ్చు. సూపర్-8లో వెస్టిండీస్‌తో మ్యాచ్ ద్వారా ఫామ్‌లోకి వచ్చిన సంజూ ఆ తర్వాత సెమీస్, ఫైనల్స్‌లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. అదే సూపర్‌ఫామ్‌ను ఐపీఎల్ 19వ సీజన్‌లోనూ కొనసాగిస్తాడని అంతా భావించిన వేళ సీన్ మొత్తం రివర్స్ అయింది.రాజస్తాన్ రాయల్స్ నుంచి ఏ ముహూర్తంలో చెన్నై సూపర్‌కింగ్స్‌కు ట్రేడ్ అయ్యాడో కానీ దారుణంగా విఫలమవుతూ వస్తున్నాడు. తొలి మూడు మ్యాచ్‌ల్లో సీఎస్‌కే ఓటమి చవిచూస్తే.. శాంసన్ ఆడకపోవడం కూడా జట్టును బాగా దెబ్బతీస్తోంది. శాంసన్ ఈ సీజన్‌లో సీఎస్‌కేకు బలమవుతాడనుకుంటే దారుణ ఆటతీరుతో బలహీనంగా మారిపోయాడు. శాంసన్ వరుసగా మూడు మ్యాచ్‌ల్లోనూ 6,7 9 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో సీఎస్‌కే అభిమానులు సంజూ శాంసన్ ఆటతీరుపై గుస్సా అవుతున్నారు. టీ20 ప్రపంచకప్‌లో హీరోగా నిలిచిన శాంసన్ ఐపీఎల్‌లో జీరో అయిపోయాడంటూ ట్రోల్స్‌కు గురి చేస్తున్నారు. రాజస్తాన్ కెప్టెన్‌గా అదరగొట్టిన శాంసన్ సీఎస్‌కేకు వచ్చేసరికి మాత్రం పూర్తిగా విఫలమవుతున్నాడు.



## 'త్వరలోనే టీమిండియా టీ20 కెప్టెన్ అవుతాడు'

టీ20 ఫార్మాట్లో గత కొంతకాలంగా పరుగుల వరద పారిస్తున్నాడు శ్రేయస్ అయ్యర్. ఐపీఎల్-2024లో కోల్‌కతా నైట్ రైడర్స్ సారథిగా వ్యవహరించిన ఈ ముంబైకర్.. జట్టును చాంపియన్‌గా నిలిపాడు. ఇక గతేడాది వేలంలో రూ. 26.75 కోట్లు పైగా వెచ్చించి పంజాబ్ కింగ్స్ అతడిని కొనుగోలు చేసి కెప్టెన్సీ పగ్గాలు అప్పగించింది.ఈ క్రమంలో ఐపీఎల్-2025లో బ్యాటర్‌గా, కెప్టెన్‌గా పంజాబ్‌కు పైసా వసూల్ ప్రదర్శన ఇచ్చాడు శ్రేయస్ అయ్యర్ (Shreyas Iyer). మొత్తంగా 17 మ్యాచ్‌లలో 604 పరుగులు సాధించిన ఈ కుడిచేతి వాటం బ్యాటర్.. సారథిగా పంజాబ్‌ను ఫైనల్‌కు చేర్చాడు.ఇక ఐపీఎల్-2026 టోర్నీని కూడా శ్రేయస్ అయ్యర్ ఘనంగా ఆరంభించాడు. ఇప్పటికి ఆడిన రెండు మ్యాచ్‌లలో జట్టును గెలిపించుకున్నాడు. బ్యాటర్‌గా రెండు మ్యాచ్‌లలో కలిపి 68 పరుగులు రాబట్టాడు. ఇదిలా ఉంటే.. గతేడాది దేశీ క్రికెట్‌లోనూ ముంబై తరఫున అయ్యర్ అదరగొట్టాడు. అయినప్పటికీ భారత టీ20 జట్టుకు సెలక్టర్లు అతడి పేరును పరిగణనలోకి తీసుకోనే లేదు. అయితే, పంజాబ్ కింగ్స్ పేసర్ వైశాఖ్ విజయ్‌కుమార్ మాత్రం శ్రేయస్ అయ్యర్ తప్పక టీమిండియా టీ20 కెప్టెన్ అవుతాడని అంచనా వేశాడు. టీమిండియా తరఫున టీ20 మ్యాచ్ ఆడాడు శ్రేయస్ అయ్యర్.